




నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

కర్నూలు నంద్యాల

శుక్రవారం 28 నవంబరు 2025

పేజీలు 8


## సమగ్ర ఓటర్ల జాబితా

# రూపకల్పనకు చర్యలు

◆ నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



చీఫ్ ఎలక్టోరకల్ అధికారి యాదవ్‌తో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజకుమారి, డీఆర్వో రామునాయక్

**నంద్యాల కల్చురల్, మేజర్‌న్యూస్ :** జిల్లాలో స్పష్టమైన, సక్రమమైన ఓటర్ల జాబితా రూపొందించడానికి సమగ్ర చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ రాజకుమారి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్‌కు వివరించారు. విజయవాడలోని ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎలక్టోరల్ రోల్స్, ఓటర్‌మ్యాపింగ్, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్–2026 సంబంధిత సన్నాహాక పనులపై అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష జరిగింది. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్‌తో పాటు డీఆర్వో రామునాయక్, ఆర్డీవోలు, తహశీల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల జాబితాకు సంబంధించిన

మిగతా 2లో

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** జిల్లాలో ప్రస్తుతం నిర్వహిస్తున్న ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియలో ఏమాత్రం తప్పులకు తావివ్వకుండా పకడ్బందీగా పని చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.ఏ సిరి బూత్ లెవెల్ ఆఫీసర్లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో కర్నూలు (అర్బన్), పాణ్యం, ఆదోని నియోజకవర్గాలకు చెందిన బూత్ లెవెల్ ఆఫీసర్లతో ఎస్ఐఆర్ 2026శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు, పాణ్యం, ఆదోని నియోజకవర్గాలలో ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ వెనుకబడి ఉందన్నారు.

మిగతా 2లో



ఉద్యోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ డా.ఏ సిరి

# ఓటర్ల మ్యాపింగ్‌లో పొరపాట్లు వద్దు

● కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్.ఏ.సిరి



కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులు, అధికారులు

# రేషన్ బియ్యం అక్రమ తరలింపు

- ట్రాక్టర్లతో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వైనం
- చోద్యం చూస్తున్న సంబంధిత అధికారులు

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్:** మండల కేంద్రమైన వెల్దుర్తి, క్రిష్ణగిరి మండలాలకు చెందిన సివిల్ సప్లై నుండి ప్రభుత్వం నిర్ణయించిన లారీలో బియ్యం తరలించకుండా ఇష్టారాజ్యంగా ట్రాక్టర్లతో తరలిస్తున్నారని సిపిఐ మండల కార్యదర్శి టి.కృష్ణ, పట్టణ సహాయ కార్యదర్శి చిన్నమాదులు, డి.రాజులు ఆరోపించారు. గురువారం స్థానిక సివిల్ సప్లై అధికారులతో సిపిఐ నాయకులు మాట్లాడుతూ ప్రైవేట్ వాహనాల ద్వారా రేషన్ బియ్యాన్ని తరలిస్తే

మిగతా 2లో




రేషన్ బియ్యాన్ని అక్రమంగా ట్రాక్టర్లతో తరలిస్తున్న దృశ్యం

## వృద్ధాప్య పేదలకు అందని

# రేషన్ బియ్యం

- ➲ రేషన్‌షాప్‌కు తాళం
- ➲ డీలర్ ఒక తాళం,నాన్‌డీలర్ ఒక తాళం
- ➲ రేషన్‌షాపు చుట్టూ తిరుగుతున్న రాజకీయం
- ➲ కులాల మధ్య చిచ్చురేగే ప్రమాదం
- ➲ చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు



రేషన్‌షాపుకు రెండుతాళాలు వేసినదాన్ని చూపిస్తున్న డీలర్ మారెప్ప

**కోసిగి మేజర్ న్యూస్:** పేద ప్రజల కడుపుకు ఏదో కొంత బియ్యాన్ని ప్రభుత్వం అందజేస్తే గ్రామంలో రాజకీయ కుల చిచ్చుల వల్ల వృద్ధ్యాప్య పేదలకు రేషన్ బియ్యం అందలేని సంఘటన కోసిగి మండలంలోని కోల్‌మాన్ పేట గ్రామంలో కనిపిస్తుంది. ఈ రేషన్‌షాప్ తమకే దక్కాలి.. లేదు మాకే దక్కాలి.. అంటూ పోటాపోటీగా పోటీపడడంతో నెల వచ్చిన వెంటనే రేషన్‌షాపు పంచాయితీ జరుగుతూనే ఉంది. దాదాపుగా సంవత్సరాలు కావస్తున్నా.. రేషన్‌షాప్ సమస్యను రెవెన్యూ అధికారులు పరిష్కరించడంలేదు. కోల్‌మాన్‌పేట గ్రామానికి చెందిన దళిత మారెప్పకు తనపేరుమీదుగా రేషన్‌షాపు మంజూరై కొన్ని సంవత్సరాలుగా రేషన్‌షాపును కొనసాగిస్తున్నారు. అయితే గతంలో వైసిపి పార్టీకి అనుకూలంగా ఉండడంతో కూటమి ప్రభుత్వం పరిపాలనలోకి వచ్చిన వెంటనే ఆ డిలర్‌పై మూడు నుండి నాలుగు సార్లు సస్పెన్షన్‌ను రెవెన్యూ అధికారులు చేపట్టారు. దీనితో డీలర్ మారెప్ప కోర్టును ఆశ్రయించి కోర్టు ఆదేశాలు జారీచేసినా.. రెవెన్యూ అధికారులు మాత్రం డీలర్‌కు అటు కూటమి నాయకులకు సరైన సమాచారం చెప్పకుండా ఇద్దరిమధ్య ప్రచ్ఛన్నయుద్ధాన్ని కొనసాగిస్తున్నారు. దీనితో ఈ రేషన్‌షాపు వల్ల గ్రామంలో కులాల మధ్య చిచ్చురేగే ప్రమాదం ఉందని గ్రామస్తులు

మిగతా 2లో

# శ్రీ మఠం పీఠాధిపతికి డాక్టరేట్ ప్రధానం

**మంత్రాలయం మేజర్ న్యూస్ :** ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థులకు ఆఫ్రికా దేశానికి చెందిన మైల్స్ లీడర్షిప్ విశ్వ విద్యాలయం వారు డాక్టరేట్ ప్రధానం చేయనున్నారు. ఈ ప్రధానోత్సవ కార్యక్రమం మంత్రాలయంలోని

మిగతా 2లో



శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి

## డిసెంబరు 5న తల్లిదండ్రులు,ఉపాధ్యాయుల

# ఆత్మీయ సమావేశం

**నంద్యాల కల్చురల్, మేజర్ న్యూస్ :** డిసెంబర్ 5న జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంను నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ రాజకుమారి తెలిపారు. ఈసమావేశానికి

మిగతా 2లో



జిల్లా కలెక్టర్ రాజకుమారి

# ఓటర్ల మ్యాపింగ్‌లో పొరపాట్లు వద్దు

(మొదటి పేజి తరువాయి)

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు సజావుగా జరగడానికి పటిష్టమైన ఓటర్ల జాబితా అత్యంత కీలకమని, అందుకోసమే ఈ మ్యాపింగ్ జరుగుతోందని కలెక్టర్ వివరించారు. ఈ ప్రక్రియలో 2002ఓటర్ల జాబితా, 2025ఓటర్ల జాబితాలోని ఓటర్ల వివరాలను సరి చూడాలని సూచించారు. ముందుగా టేబుల్ టాప్ ఎక్సర్‌సైజును పూర్తి చేయాలని, అనంతరం బూత్ లెవెల్ ఆఫీసర్లు ఇంటింటికి స్వయంగా వెళ్లి ఓటర్ల గురించి విచారించి నిర్ణీత పత్రాలలో వివరాలు సేకరించుకోవాలని, ఆ తర్వాతనే డ్రాఫ్టరోల్లో పేర్లు ఉంచాలని ఆమె స్పష్టం చేశారు. మరణించినా అందుబాటులో లేని ఓటర్ల వివరాలను గుర్తించి వారికి నోటీసులు అందచేసిన తర్వాతే తొలగించడానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాబోయే పదిరోజుల్లో అర్బన్ ప్రాంతంలో 80శాతం, గ్రామీణ ప్రాంతంలో 90శాతం ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని, ఈ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లు లేకుండా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జెసి నూరుల్ కమర్, డిఆర్‌ఓ వెంకట నారాయణమ్మతో పాటు సంబంధిత తహశీల్దార్లు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్లు పాల్గొన్నారు.

# సమగ్ర ఓటర్ల జాబితా రూపకల్పనకు చర్యలు

(మొదటి పేజి తరువాయి)

ఏ దరఖాస్తులు పెండింగ్‌లో లేవని తెలిపారు. బూత్‌స్థాయి అధికారుల రేషనలైజేషన్ ప్రతిపాదనలను ఇప్పటికే పంపినట్లు వాటికి సంబంధించిన బిఎల్‌ఓ వివరాలన్నీ సమర్పించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలో ఎటువంటి బిఎల్‌ఓ ఖాళీలు లేవని ఎన్నికల ఖర్చుల నివేదికను కూడా సీఈఓ కార్యాలయానికి పంపినట్లు తెలిపారు. కొత్త పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన బిఎల్‌ఓల జాబితాను కూడా ప్రచురించినట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి జిల్లాలో స్వచ్ఛమైన, తప్పులులేని ఓటర్ల జాబితా రూపొందించడానికి కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు చేయాలని సిమిలర్ ఫోటోలు, మరో ప్రాంతానికి మారినవారి పేర్లు, మరణించిన వారి పేర్లు, ఒకే ఇంటి నెంబర్‌పై అధిక సంఖ్యలో ఓట్లు, ఒకే వ్యక్తి పేరుతో అధిక ఓట్లు వంటి లోపాలను పూర్తిగా తొలగించాల్సిందిగా ఆదేశించారు.

# రేషన్ బియ్యం అక్రమ తరలింపు

(మొదటి పేజి తరువాయి)

బ్లాక్ మార్కెట్ తరలించే ప్రమాదం ఉందని, అదేవిధంగా వెల్దుర్తి, క్రిష్ణగిరి మండలాలకు చెందిన గతంలో డీలర్లు బ్లాక్ మార్కెట్‌కు డైరెక్ట్‌గా తరలించిన దాఖలాలు ఉన్నాయన్నారు. కావున సివిల్ సప్లై అధికారులు ప్రభుత్వం నిర్ణయించిన వాహనాల ద్వారానే తలించే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రైవేట్ వాహనాల ద్వారా తరలిస్తే సంబందిత జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

# శ్రీ మఠం పీఠాధిపతికి డాక్టరేట్ ప్రధానం

(మొదటి పేజి తరువాయి)

శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం యోగేంద్ర మండపంలో నవంబరు 29వ తేదిన నిర్వహించనున్నట్లు తెలిపారు. మైల్స్ లీడర్షిప్ విశ్వ విద్యాలయం అధికారులు, అలాగే అనేకమంది విశిష్ట అతిధులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. శ్రీ రాఘవేంద్ర స్వామి భక్తులు, శిష్యులు పాల్గొని పీఠాధిపతి ఆశీస్సులు పొందాలని కోరారు.

## డిసెంబర్ 5న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం

(మొదటి పేజి తరువాయి)

ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజర పిల్లల విద్యా ప్రగతిపై ఉపాధ్యాయులతో ప్రత్యక్షంగా చర్చించాలని ఆమె సూచించారు. గురువారం కలెక్టర్ చాంబర్ నుంచి ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులతో మెగా పిటియం ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబర్ 5న ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12.45గంటల వరకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం కొనసాగుతుందని ఇందులో విద్యార్థుల అకడమిక్ ప్రదర్శన, చదువులో ఎలా ఉన్నారు ఇతర కార్యక్రమాల్లో ఎలా పాల్గొంటున్నారు తదితర విషయాలపై మాట్లాడుతారన్నారు. సమావేశం అనంతరం విద్యార్థుల ప్రతిభ కార్డు అందజేస్తారని తెలిపారు. ప్రతి మండలంలో ప్రత్యేక అధికారులు ఈ కార్యక్రమాన్ని సమీక్షించనున్నారని ప్రజాప్రతినిధులు, అధికారులు తమ పరిధిలోని పాఠశాలల్లో హాజరుకానున్నారని తెలిపారు.

# చికిత్స పొందుతూ కోలుకోలేక విద్యార్థి మృతి

**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :**



మండల కేంద్రమైన పెద్దకడుబూరు గ్రామానికి చెందిన వడ్డే నగేష్ కుమారుడు వడ్డే ప్రవీణ్ వయస్సు (6)అనే బాలుడు చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందాడు. విద్యార్థితల్లిదండ్రులు, బందువులు పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దకడబూరు గ్రామానికి చెందిన వడ్డే నాగేష్ కుమారుడు ప్రవీణ్ అనే బాలుడు ఈనెల 11వ తేదీన ప్రవీణ్ స్కూలుకు వెళ్లాలని స్నానానికి వేడి నీరు తీసుకునే సమయంలో అనుకోకుండా పిల్లవాడికి మంటలు అంటుకున్నాయని, పిల్లవాడిని ఆదోని గవర్నమెంట్ హాస్పిటల్లో కర్నూలు హొమియో హాస్పిటల్ నందు చికిత్స చేయించినా నయం కాలేదని,కాలిన గాయాల నుండి కోలుకోలేక గురువారం తెల్లవారు జామున మృతి చెందాడు. విద్యార్థి తండ్రి వడ్డే నగేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ నిరంజన్ కుమార్ రెడ్డి విలేకరులకు తెలిపారు.

# వృద్ధాప్య పేదలకు అందని రేషన్ బియ్యం

(మొదటి పేజి తరువాయి)

ఆరోపిస్తున్నారు. రేషన్‌షాపు సమస్యను రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ప్రతినెల రేషన్‌బియ్యం ప్రజలకు అందాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. అలాగే ఈనెల రేషన్ బియ్యాన్ని డీలర్ మారెప్ప అనుమతితో 26వతేదీ నుండి వృద్దులకు బియ్యాన్ని పంపిణీచేయడం జరిగింది. ప్రతినెల 26వతేదీన వృద్దుల ఇంటిదగ్గరకే వెళ్ళి రేషన్ డీలర్లు బియ్యాన్ని పంపిణీచేయాలని ఆదేశాలు ఉండడంతో రెండురోజులపాటు డీలర్ మారెప్ప బియ్యాన్ని పంపిణీచేశారు. అయితే అదే గ్రామానికి చెందిన కామన్‌దొడ్డి ఉసేని, మదిరి లక్ష్మయ్య అనేవారు రేషన్‌షాపుకు తాళం వేయడం జరిగింది. ఒకతాళం డీలర్ మరోతాళం నాన్ డీలర్‌లు తాళం వేయడంతో వృద్దులు రేషన్‌బియ్యం అందక బియ్యంకోసం ఎదురుచూస్తూ ఆకలితో అలమటిస్తున్నారు. బియ్యాన్ని బయట కొనాలంటే వృద్దులకు స్థోమతలేక బియ్యంకోసం ఎదురుచూస్తూ ఈ రాజకీయ కక్షల వల్ల వృద్దులు ఆకలితో అలమటిస్తూనే ఉన్నారు. ఈ విషయాన్ని డీలర్ మారెప్ప ఆర్ఐ దృష్టికి, తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్ళినా.. పట్టించుకోవడంలేదని డీలర్ మారెప్ప వాపోతున్నారు. ఇది ఇలాగే కొనసాగితే గ్రామంలో కులాల మద్య చిచ్చురేగే ప్రమాదానికి రెవెన్యూ అధికారులే కారకులు అవుతారని గ్రామస్తులు పరోక్షంగా విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు నిద్రావ్యవస్థనుండి మేల్కొని రేషన్‌షాప్ సమస్య పరిష్కరించి ప్రజలకు రేషన్ బియ్యం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# మెరుగైన విద్యను బోధించండి- జిల్లా విద్యాశాఖాధికారి

**మేజర్‌న్యూస్,చాగలమర్రి :** ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన,మెరుగైన విద్యను విద్యార్థులకు బోధించాలని జిల్లా విద్యా శాఖాధికారి జనార్ధన్‌రెడ్డి సూచించారు.మండలంలోని మద్దూరు ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలు, కిచెన్ గార్డెన్ లాంటి అంశాలను ఎంతో అద్భుతంగా తీర్చిదిద్దారని ప్రసంశించారు. స్థానిక పాఠశాలలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రవీంద్రారెడ్డి తన సొంత నిధులతో పాఠశాల తరగతి గదుల్లో గ్రానైట్ వేయించినందుకు, ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రవీంద్రారెడి తన సొంతనిదులతో పాఠశాలకు వేయించిన పెయింటింగ్ తదితర వాటిని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 210 ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయన్నారు. నూతన డిఎస్సీ ద్వారా జిల్లాలో 645 ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ అయ్యాయన్నారు.



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డిఈఓ

జిల్లాలో ఆపార్ ఐడి జనరేషన్ 91 శాతం పూర్తి అయ్యిందన్నారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖే చేసి విద్యార్థులతో కలసి భోంచేసారు. కార్యక్రమంలో ఎంఈవో న్యామతుల్లా, ప్రధానోపాధ్యాయులు మహబూబ్బాష, రవీంద్రారెడ్డి,మాబుషరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు

**కోవెలకుంట్ల, మేజర్‌న్యూస్ :** ప్రశాంతమైన గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు తప్పవని కోవెలకుంట్ల ఎస్సై మల్లికార్జున రెడ్డి అన్నారు. మండలంలోని చౌదరదిన్నె గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమం జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ ఆదేశాల మేరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరు కలిసిమెలసి గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. సమాజంలో జరుగుతున్న నేరాలపై ప్రజలకు అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై మల్లికార్జున రెడ్డి

కల్పించారు. మహిళలకు, చిన్నారులకు పోలీసు శాఖ అండగా ఉంటుందని మహిళల భద్రత కొరకు శక్తి యాప్ రూపొందించడం జరుగుతుందని అన్నారు. ఎవరైనా మహిళల పట్ల అసభ్యకర ంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే టోల్‌ఫ్రీ నెంబరు 112కు ఫోన్ చేసి సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రాయలసీమ యూనివర్సిటీలో పరిశోధనలు పెంచాలి

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** రాయలసీమ యూనివర్సిటీలో పరిశోధక విద్యను అభివృద్ధి చేయాలని ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి అబ్దుల్లా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ సర్వసభ్య సమావేశం ఎస్ఎఫ్ఐ కన్వీనర్ రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాయలసీమ యూనివర్సిటీ ఎంతో వెనుకబ డిందని యూనివర్సిటీ అభివృద్ధి కోసం పరిశోధన విద్యను అభివృద్ధి చేయాలని కోరా రు. పరిశోధన విద్యను అభివృద్ధి చేయడం ద్వారానే యూనివర్సిటీ అభివృద్ధి చెందుతుందన్నారు. అలాగే యూనివర్సిటీలో నూతన రెగ్యులర్ కోర్సులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సందీప్ నాయక్, కార్యదర్శిగా రామకృష్ణ,సహాయ కార్యదర్శులుగా ఓబులేసు, శ్యామ్ కుమార్, సందీప్, అశోక్, ఉపాధ్యక్షులుగా విక్రమ్, అశోక్, భరత్, తేజలతో




మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి అబ్దుల్లా

పాటు మరో 16మందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**కర్నూలు కల్చరల్, మేజర్‌న్యూస్ :** విశ్వహిందూ పరిషత్ సేవా విభాగం ఆద్వర్యంలో శ్రీ రాఘవేంద్ర స్వామి ప్రఖండ ఆద్వర్యంలో అమీలియో హాస్పిటల్ వారి సౌజన్యంతో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని యునైటెడ్ క్లబ్ జిల్లా కోర్టు ఎదురుగా నిర్వహించారు. విహెచ్‌పి రాష్ట్ర అధ్యక్షులు నందిరెడ్డి సాయి రెడ్డి, విహెచ్‌పి రాష్ట్ర సేవా ప్రముఖ్ టిసి మద్దిలేటి, జిల్లా అధ్యక్షులు గోవిందరాజులు, ఈపూరి నాగరాజు, శివపురం మణికంఠ, బెస్త పరశురాముడు, గోరక్ష ప్రముఖ్, యశ్వంత్ రాఘవేంద్ర స్వామి ప్రఖండ భజరంగ్‌దళ్ సంయోజక్, విహెచ్‌పి, భజరంగదళ్ కార్యకర్తలు పాల్గొన్నారు. యునైటెడ్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి అమీలియో ఆసుపత్రి వారి స్టాఫ్ సహాయ, సహకారాలతో ఉచిత వైద్య మెగా శిబిరం విజయవంతంగా పూర్తయింది. ఉచిత వైద్య శిబిరంలో దాదాపు 200మంది ప్రజలు పాల్గొని వారి ఆరోగ్య సమస్యలకు సంబంధించి ఉచితంగా పరీక్షలు చేయించుకుని మందులు పొందారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

# రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం - ఎ.డి.ఎ సుధాకర్

**దొర్నిపాడుమేజర్,న్యూస్ః** రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కోవెలకుంట్ల సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్. సుధాకర్ రైతులకు సూచించారు. గురువారం మండల పరిధిలోని గుండుపాపల , డబ్ల్యు గోవిందిన్నె, డబ్ల్యు కొత్తపల్లె గ్రామాలలో గురువారం రైతన్న మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎ.డి.ఎ సుధాకర్ మాట్లాడుతూ రైతులకు సాగులో కొత్త వంగడాలను మెలకువలను తెలియజేశారు. రైతులు సిఫరాసు చేసిన మోతాదు మేరకు మాత్రమే ఎరువులు వాడాలని తెలియజేశారు. మండల వ్యవసాయ అధికారిని, వ్యవసాయ సిబ్బందితో కలిసి


కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎ.డి.ఎ సుధాకర్, ఎ.ఒ ప్రమీళ

ఇంటింటికి తిరుగుతూ వ్యవసాయ పరికరాలు, అనుబంధ శాఖల పథకాల గురించి అవగాహన కల్పిస్తూ కరపత్రాలను అందించారు. రైతుల కోసం ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెడుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పి.ఎం కిసాన్ కింద బ్యాంకు ఖాతాలకు డబ్బులు జమచేసినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం అమలు చేసే పంచ సూత్రాలతో రైతులకు ఎంతో మేలు కలుగుతుందని మండల వ్యవసాయ అధికారిని వి. ప్రమీళ సూచించారు. వ్యవసాయ అధికారుల సలహాలు , సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో కోవెలకుంట్ల వ్యవసాయ సహాయ సంచాలకులు ఎన్. సుధాకర్, మండల వ్యవసాయ అధికారి ప్రమీళ, ఆయా గ్రామాల రైతన్న మీ కోసం టీం సభ్యులు, రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులు అరటిపంట దిగుబడిలో శ్రద్ధ చూపించాలి

**జిల్లా ఉద్యానశాఖ అధికారి యు.నాగరాజు**

**ప్యాపిలి, మేజర్‌న్యూస్ః** రైతులు వారు సాగుచేసిన అరటి పంట దిగుబడిలో ప్రత్యేకమైన శ్రద్ధ చూపించాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి యు.నాగరాజు అన్నారు. గురువారం మండల పరిధిలోని గుడిపాడు, పిఆర్.పల్లె గ్రామాలలో రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా రైతులు సాగు చేసిన అరటిపంటలను జిల్లా ఉద్యాన శాఖ అధికారి యు.నాగరాజు, మండల ఉద్యానశాఖ అధికారిణీ జి.కళ్యాణిలు పరిశీలించారు. అనంతరం అరటి ధరల గురించి రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాశాఖ అధికారి యు.నాగరాజు మాట్లాడుతూ డిసెంబర్ నెలలో ధరలు పెరిగే అవకాశం ఉందని, అరటి రెండవ పంట నాణ్యతపై, సిగటోక యాజమాన్య పద్ధతులపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఎక్కువ నీటి అద్దడి లేకుండా కావల్సినంత నీటిని మాత్రమే డ్రిప్పు ద్వారా అరటిచెట్లకు అందజేయాలన్నారు. అరటి గెల నాణ్యత పెరగడం కోసం ఫ్రూట్ కేర్


అరటితోటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారులు

ఆక్టివిటీ(గెలల యాజమాన్యం) చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు, రైతుసేవాకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## అహోబిలంలో 69వ ఎస్ జి ఎఫ్ అండర్-17అంతర్ జిల్లా క్రీడా పోటీలు ప్రారంభం

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** మండలంలోని అహోబిలంలో గురువారం 69వ ఎస్ జి ఎఫ్ అండర్ 17 బాలబాలికల అంతర్ జిల్లా క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అహోబిలం జడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి జనార్దన్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక ఆరోగ్యానికే కాదు మానసికంగా ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. ప్రభుత్వం అందిస్తున్న మూడు శాతం క్రీడాకోటాను విద్యార్థులు తప్పకుండా వినియోగించుకోవాలన్నారు. క్రీడల్లో పాల్గొనడం అనేది ప్రతి విజయానికి బాటలు వేసే తొలి అడుగు అన్నారు.అపుస్మ నంద్యాల డివిజన్ అధ్యక్షులు అమీర్ భాష, ఎస్ జి ఎఫ్ కార్యద ర్శులు విశ్వనాథ్, ఆశాజ్యోతి, టోర్నమెంట్ ఆర్గనైజర్ నాగేంద్ర, ఏపీ ఎస్ ఏ పి గౌరవాధ్యక్షులు ఏపీ రెడ్డి, ఎస్ ఏ పి అసోసియేషన్ దండే నాగరాజు,



మాట్లాడుతున్న డీఈఓ జనార్దన్ రెడ్డి

బేస్బాల్ సౌత్ జోన్ చైర్మన్ పాల్ నాగరాజు, ఏపీ బేస్ బాల్ అసోసియేషన్ సీఈఓ మాధవరావు,ఉపాధ్యాయులు,సహకార సభ్యులుకవిత,దేవేంద్ర, శ్రీధర్, సుమలత, భారతి, లక్ష్మీ ప్రసన్న, చంద్ర, రవి, ధర్మరాజు, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, దాదాపీర్, శ్రీనివాస రెడ్డి, శ్రీనాథ్, నరేంద్ర, విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అండగా కూటమి ప్రభుత్వం-ఎమ్మెల్యే జయసూర్య

**కొత్తపల్లి, మేజర్‌న్యూస్ :** రైతులకు ప్రభుత్వ పథకాలు అందజేస్తూ వారికి అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య తెలిపారు. గురువారం మండలంలోని కొక్కెరంచ గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలోని రైతుల ప్రతి ఇంటికి వెళ్లి రైతన్న మీకోసం క రపత్రాలను రైతులకు అందజేస్తూ ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. రైతుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయసూర్య మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం రైతులకు


కొక్కెరంచలో కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

ఇచ్చిన మాట ప్రకారం అన్నదాత సుఖీభవ నిధులను రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి రైతులకు సకాలంలో రాయితీపై ఎరువులు, విత్తనాలు అందిస్తూ వారి సంక్షేమం కోసం కృషి చేస్తుందని అన్నారు. మొక్కజొన్న పంట వేసిన రైతులు ఆందోళన చెందవద్దని త్వరలోనే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలపై శుభవార్త చెబుతుందని అన్నారు. సేంద్రీయ ఎరువులపై రైతులు మక్కువ చూపి అధిక దిగుబడులు సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ నాగజ్యోతి, తహశీల్దార్ ఉమారాణి, ఎంపీడీఓ మేరీ, వ్యవసాయ అధికారి అమీరున్నిసా బేగం, మండల కన్వీనర్ లింగస్వామి గౌడు, క్లస్టర్ ఇన్‌చార్జ్ నారపు రెడ్డి, మాజీ మండల కన్వీనర్ చంద్రశేఖర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కోక్లస్టర్ అమర్నాథ్ యాదవ్, జహరుల్లా, మద్దిలేటి, రఫీ, మన్సూర్, సుధాకర్, జానకిరాముడు, శివారెడ్డి, వివిధ గ్రామాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆంగ్ల భాషపై పట్టు సాధించాలి - ఇంఛార్జ్ ప్రిన్సిపల్ డా. రంగారెడ్డి

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** పెరుగుతున్న పోటీ ప్రపంచంలో విద్యార్థులు తప్పకుండా ఆంగ్లభాషపై పట్టు సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని క్లస్టర్ యూనివర్సిటీ కెవిఆర్ డిగ్రీ కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్ డా. రంగారెడ్డి పేర్కొన్నారు. గురువారం క్లస్టర్ యూనివర్సిటీ కెవిఆర్ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల శాఖ విభాగాధిపతి డా.ఎస్ఎం బాష అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఆంగ్లం తెలిసిన వారు ఉన్నారని కావున విద్యార్థులు ఈ భాషని ఎక్కువగా నేర్చుకోవాలన్నారు. ఆంగ్లం బాగా మాట్లాడే వారికి ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల శాఖ అధ్యాపకులు సునీత, లలిత, సోనీ, జ్యోతి, ఈశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.



## కెవిఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో కారాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** యూనివర్సిటీ కరాటే అసోసియేషన్ ఆద్వర్యంలో గురువారం కెవిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కలాశాలలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. ఇందులో 22మంది విద్యార్థినీలు బ్లూ బెల్ట్ సాధించారు. ఈ కార్యక్రమానికి కాలేజీ వైస్ ప్రిన్సిపల్ జీవి డాక్టర్ రంగారెడ్డి మాట్లాడుతూ ఈరోజుల్లో మహిళలకు కరాటే ఉషూలాంటి మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల ఆత్మరక్షణతో పాటు ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. చదువుతో పాటు మీకు నచ్చిన క్రీడల్లో రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డా. ఆర్థి చక్ర, ఐ.క్యూ.ఏసి. కోఆర్డినేటర్ పావని, పిడి ఇంచార్జ్ మౌనిక, పిడి ఎగ్జామినర్ గీతలు పాల్గొన్నట్లు మాస్టర్ పి శ్రీనివాసులు తెలిపారు.


బ్లూ బెల్ట్ సాధించిన క్రీడాకారిణులు

## స్థానిక సంస్థ ఎన్నికల్లో బ్రాహ్మణులకు ప్రాధాన్యత కల్పించాలి


యన్ వెంకట రామరాజు

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బ్రాహ్మణులకు ప్రాధాన్యత కల్పించాలని ఏపి బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య మాజీ అధ్యక్షులు యన్ వెంకట రామరాజు అన్ని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ చట్టసభల్లో బ్రాహ్మణులకు ప్రస్తుతం ప్రాతినిధ్యం లేదని మా సమస్యలు తెలపడానికి అవకాశం లేకుండా పోయిందని రామరాజు తెలిపారు. కావున వచ్చే ఎన్నికల్లో అన్ని పార్టీలు సీట్లు కేటాయించి బ్రాహ్మణ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు.

# నగర పరిశుభ్రత-ఆరోగ్యం అందరి బాధ్యత

**ః- నగరపాలక కమీషనర్ పి విశ్వనాథ్**

**కర్నూలు (కెఎంసి), మేజర్‌న్యూస్ :** నగర పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ, రహదారి భద్రత పట్ల ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని నగరపాలక సంస్థ కమీషనర్ పి విశ్వనాథ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నగర అందాన్ని కాపాడుకోవడం, ప్రజారోగ్యాన్ని సంరక్షించడం కోసం సుప్రీంకోర్టు మార్గదర్శకాలను కట్టుదిట్టంగా అమలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. నగరంలో అపరిశుభ్రంగా పెరిగిన పిచ్చి మొక్కలతో ఉన్న ఖాళీ స్థలాలను యజమానులు వెంటనే శుభ్రం చేసుకోవాలని సూచించారు. లేనిపక్షంలో నోటీసులు జారీ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని తెలిపారు. అలాగే రహదారులపై పశువులను వదిలితే వాటిని గోశాలకు తరలించి వారంలో జరిమానా చెల్లించకపోతే యాజమాన్య హక్కులు రద్దు అవుతాయని స్పష్టం చేశారు. హోటళ్లు, రెస్టారెంట్లు, ఫంక్షన్ హాల్స్ తదితర సంస్థల నిర్వాహకులు మిగిలిన ఆహారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ బహిరంగ ప్రదేశాల్లో పారవేయరాదని హెచ్చరించారు. ప్రజలు స్వచ్ఛమైన నగర నిర్మాణంలో సహకరించాలని కమీషనర్ కోరారు.

# అన్నదాతకు అండగా కూటమి ప్రభుత్వం


మీకోసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న టిడిపి నాయకులు, ఏఓ

**కోడుమూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలకు ఎల్లప్పుడు అండగా ఉంటుందని అందుకే రైతన్న మీకోసం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని టిడిపి మండల కన్వినర్ అనుగొండ రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని కృష్ణాపురం గ్రామంలో వ్యవసాయాధికారి రవిప్రకాష్ ఆద్వర్యంలో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ సాగును లాభసాటిగా మార్చాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందన్నారు. రైతన్న సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల వ్యవసాయ అధికారి రవిప్రకాష్ మాట్లాడుతూ రసాయన పేరుల వాడకాన్ని తగ్గించి సేంద్రీయ వ్యవసాయ అలవాట్లను అలవరచుకోవాలని రైతులకు సూచించారు. పెట్టుబడులను తగ్గించి లాభసాటిగా ఉండే పంటలను వేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బలరాం, పురుషోత్తం రెడ్డి, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి..ఎఐసిసి ఇన్చార్జ్ యోగేష్

**దేవనకొండ మేజర్ న్యూస్ :**

దేశం అశివృద్ధి చెందాలంటే అది కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఎఐసిసి ఇన్చార్జ్ యోగేష్ అన్నారు.రాహుల్ గాంధీ,పిసిసి అధ్యక్షులు షర్మిళ ఆదేశాల మేరకు గురువారం దేవనకొండ టర్నింగ్ ఆర్ఆర్ ఫంక్షన్ హాలు నందు పిసిసి పరిశీలకులు శంకరన్న,నాగరాజుతో కలిసి యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మహేంద్ర నాయుడు అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వారు సంఘటన్ శ్రీజన్ అభియాన్ ద్వారా నాయకులకు పార్టీ బలోపేతం,అభివృద్ధి,ప్రజల కోసం చేయాల్సిన కార్యాక్రమాల గురించి సూచనలు,సలహాలు గురించి వివరించారు.ఇందులో బాగంగా ఆలూరు నియోజకవర్గంలో నెలకొన్న ప్రజా సమస్యలు,అందుకు చేయాల్సిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.అదే విధంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడ ప్రజలకు అందుబాటులో ఉంటూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు వ్యతిరేకంగా అవలంభిస్తున్న విధి విధానాలను అర్థం అయ్యేలా పూర్తిగా వివరించాలన్నారు.దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి అభివృద్ధి ఏ విధంగా ఉంటుందో ప్రజలకు వివరించాలని కోరారు.అలాగే పార్టీకి సంబంధించిన ఏ సమస్యలైనా మరియు పార్టీ బలోపేతం కొరకు చేయాల్సిన విషయాలను వివరిస్తే పార్టీ పెద్దలకు ఆ వివదరాలను అందజేస్తామని తెలిపారు.

# షిరిడి సాయిబాబాకు వెండి బహూకరణ

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** నగరంలో దక్షిణ షిరిడిగా పేరుగాంచిన షిరిడి సాయిబాబా దేవస్థానానికి బొల్లవరం గ్రామస్తులు ఈశ్వరయ్య ధర్మపత్ని పద్మావతి 1కేజీ250గ్రాముల వెండిని స్వామి వారికి బహూకరించారు. డిసెంబరు 4వ తేదీన దత్త జయంతి పర్వదినం పురస్కరించుకుని గురువారం సాయిబాబా దేవాలయంలో వెండిని సమర్పించినట్లు తెలిపారు. ఆలయ పాలకమండలి ప్రధాన కార్యదర్శి మహాబలేష్ సజ్జనార్ స్వామి వారి తరపున వెండిని స్వీకరించారు.


షిరిడి సాయిబాబాకు అందచేసిన వెండి

# స్థానిక సంస్థల ఎన్నికల్లో దూసుకెళ్లాలి

**-టిడిపి రాష్ట్ర కార్యదర్శి పోతుల రవికుమార్**



**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్:** రాబోయే స్థానికసంస్థల ఎన్నికల్లో బూత్ కన్వీనర్లు, కో- కన్వీనర్లు పార్టీ గెలుపే లక్ష్యంగా ముందుకు పోవాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల రవికుమార్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే బీవీ. జయ నాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మిగనూరు పట్టణ టిడిపి అధ్యక్షులు మాచాని మహేష్ ఆధ్వర్యంలో బూత్ కన్వీనర్లు, కో-కన్వీనర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ మేరకు బూత్ లకు సంబంధించిన విషయాలు సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిబూత్‌లో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి బూత్ అత్యధిక మెజార్టీ సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కుర్ని కార్పొరేషన్ చైర్మన్ కామర్తి విన్నప్ప, క్లస్టర్ ఇంచార్జి కామర్తి మహేష్, జిలాని, ఖలీల్, కొండన్న గౌడ్, శంకర్ గౌడ్, జహంగీర్, బూత్ కన్వీనర్లు, కో - కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

## నంద్యాల ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ శివ బాలి రెడ్డికి జాతీయస్థాయి పురస్కారం

**-ఉత్తమ వైజ్ఞానిక పరిశోధన పత్రం అవార్డు**



**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్ :** నంద్యాల ఫిజియోథెరపిస్టుల సంఘం కార్యదర్శి డాక్టర్ శివ బాలి రెడ్డి వారణాసి లో ఉన్న బెనారస్ హిందూ యూనివర్సిటీ మెడికల్ సైన్సెస్ ఇన్స్టిట్యూట్ లో ఇటీవల జరిగిన రెండు రోజుల అంతర్జాతీయ స్థాయి సదస్సులో సమర్పించిన పరిశోధన పత్రానికి ఉత్తమ వైజ్ఞానిక పరిశోధన పత్రం పురస్కారం ప్రదానం అందుకున్నారు. ఉత్తరప్రదేశ్ మధురలో ఉన్న సంస్కృతి విశ్వవిద్యాలయం రిహాబిలిటేషన్ సైన్సెస్ శాఖలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న నంద్యాలకు చెందిన ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ శివ బాలి రెడ్డి అంతర్జాతీయ సదస్సులో "ఎముకలు, కీళ్ల శస్త్ర చికిత్సల తర్వాత రోగి పునరావాసంలో ఫిజియోథెరపీ పాత్ర"అన్న అంశంపై సమర్పించిన పరిశోధన పత్రానికి ఉత్తమ వైజ్ఞానిక పరిశోధన పత్రం అవార్డు ను నిర్వాహక కమిటీ చైర్మన్ డాక్టర్ సంతోష్ పాండే, సైంటి ఫిక్ కమిటీ చైర్మన్ డాక్టర్ కృష్ణ శర్మ, నిర్వాహక కార్యదర్శి జ్ఞాన్ పురీ అంద చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శివ బాలి రెడ్డి కి నంద్యాల జిల్లా ఫిజియోథెరపిస్టుల సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, కన్వీనర్ డాక్టర్ రోహిణి, కోశాధికారి డాక్టర్ జగదీష్ , సంఘం సభ్యులు అభినందనలు తెలిపారు.

## విద్యుత్ శాఖ ఆళ్లగడ్డ డి ఈ ఈ గా శ్రీనివాసులు బాధ్యతలు

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ శాఖ డీఈఈ గా శ్రీనివాసులు గురువారం బాధ్యతలు చేపట్టారు. వాటర్‌యూజర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నూక నరసింహారెడ్డి, విద్యుత్ శాఖ అధికార సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. చాగలమర్రి ప్రాంతానికి చెందిన శ్రీనివాసులు నంద్యాల రూరల్ ఏఈగా పనిచేశారు. పదోన్నతి పై ఆళ్లగడ్డ ఆపరేషన్ డి ఈఈ గా బాధ్యతలు స్వీకరించడం జరిగిందన్నారు. గృహ వినియోగదారులు, వాణిజ్య వినియోగదారులకు ఎలాంటి విద్యుత్ సమస్యలు వచ్చినా వెంటనే తమను సంప్రదించాలన్నారు.


శుభాకాంక్షలు తెలియజేస్తున్న దృశ్యం

## అసెంబ్లీ పోటీలలో ప్రతిభ చాటిన హెచ్. మురువణీ విద్యార్థి



**పెద్దకడుబూరు మేజర్ న్యూస్:** పెద్దకడబూరు మండల పరిధిలోని హెచ్.మురవణి గ్రామంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న పవిత్ర అనే విద్యార్థి స్టేట్ స్టూడెంట్ అసెంబ్లీలో భాగంగా నిర్వహించిన పోటీలలో నియోజకవర్గం స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారు. ఇందులో భాగంగా కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి మాక్ అసెంబ్లీలోను పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాక్ అసెంబ్లీ కి ఎన్నికైన విద్యార్థులతో ముఖాముఖీ నిర్వహించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు కలెక్టర్ సిరి,జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామియేల్ పాల్ చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రం, మెమోంట్ తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాముడు. ఉపాధ్యాయులు గ్రామ ప్రజలు పలువురు విద్యార్థులు పవిత్రను అభినందించారు.

# మోదీది గోల్డెన్ హ్యాండ్..రాహుల్ ది ఐరన్ లెగ్

**-సీనియర్ రాజకీయ నాయకులు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి**

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** దేశ రాజకీయాల్లో రాహుల్ గాంధీది ఐరన్ లెగ్ అని ఆయన ఉన్నంతవరకు మోదీది గోల్డెన్ హ్యాండ్ అని సీనియర్ రాజకీయ నాయకుడు,మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి విమర్శించారు. గురువారం శ్రీశైలంలో ఆయన మాట్లాడుతూ..కూటమి ప్రభుత్వం శాశ్వతంగా ఉంటుందన్నారు. శ్రీశైలం దేవస్థానం నియామకాల్లో లోకల్ వారికి పెద్దపీట వేయాలన్నారు.ప్రధాని శ్రీశైలం పర్యటన చారిత్రక ఘట్టమని,భవిష్యత్తులో శ్రీశైలం మరింతగా అభివృద్ధి చెందుతుందన్నారు.



వైసీపీ అధినేత జగన్ పై కూడా ఆయన పలు విమర్శలు చేశారు.అలాగే కొన్ని విషయాల్లో నాయకుల కమిషన్ల పర్వం కొనసాగుతుందని దీన్ని అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.ఎంపీ బైరెడ్డి శబరి శ్రీశైలం క్షేత్ర అభివృద్ధికై ఎయిర్పోర్టు, రైల్వే లైన్ గురించి వినతి అందజేసినట్లు,అయితే అటవీ శాఖ నిబంధనలు అడ్డంకిగా మారాయి అన్నారు.

**మల్లన్న సేవలో బైరెడ్డి రాజశేఖర రెడ్డి :** శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను సీనియర్ రాజకీయ నాయకుడు బైరెడ్డి రాజశేఖర రెడ్డి గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.దర్శనార్థమై ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న ఆయనకు అధికారులు, అర్చక స్వాములు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. ప్రత్యేక పూజలు అనంతరం వేద ఆశీర్వచనం అందజేసి శేష వస్త్రం, లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

# 132మంది విద్యార్థినీ,విద్యార్థులకు ఉపకరణాల స్క్రీనింగ్

**బనగానపల్లె ,మేజర్‌న్యూస్:** బనగానపల్లె నియోజకవర్గంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉచిత సహాయ ఉపకరణాల నిర్ధారణ శిబిరం బనగానపల్లె పట్టణం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు. బనగానపల్లె, కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల, అవుకు, సంజామల మండలాల నుండి ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సమగ్ర శిక్షా విద్యాశాఖ మరియు అలింకో ఆధ్వర్యంలో నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. దాదాపుగా 132మంది విద్యార్థినీ విద్యార్థులకు మూడు చక్రాల సైకిళ్లు , చక్రాల కుర్చీలు, వినికిడి యంత్రాలు, మానసిక వైకల్యం ఉన్న వారికి బోధన సామాగ్రి, అంధులకు బ్రెయిలి స్క్రిప్ట్ కోసం నిర్ధారణ పరీలు జరిగాయి. ఈ సందర్భంగా అలింకో డాక్టర్లయిన కుమారి, ప్రియ, వర్మ మరియు తివారి పిల్లలను పరీక్షించి అవసరమైన ఉపకరణాలను నిర్దేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అవుకు మండల విద్యాశాఖ అధికారి శ్రీధర్, స్వరూప, వెంకటేశ్వరరెడ్డి, బనగానపల్లె మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసులుస తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

# డాక్టర్ సుధాకుమారి సేవలు అభినందనీయం

**కర్నూలు వైద్యం, మేజర్‌న్యూస్ :** కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ సుధాకుమారి విధి నిర్వహణ సేవలు అభినందనీయమని కెఎంసి కళాశాల ప్రిన్సిపల్ డా.చిట్టి నరసమ్మ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కె వెంకటేశ్వర్లు అన్నారు. ఈ నెల 30వ తేదీన పదవీ విరమణ సందర్భంగా గురువారం కాలేజీ కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఏపి డిజీఏలు వీడ్కోలు వేడుకలు ఘనంగా నిర్వహించి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ సుధా కుమారి తన పదవీ కాలంలో అడ్మినిస్ట్రేటర్‌కి ఉండవలసిన ఉన్నతమైన లక్షణాలు పుణికిపుచ్చుకున్నారని కొనియాడారు. తన విభాగం తరపున అనేక సర్వేలు, ప్రాజెక్టులు చేపట్టామని తన విభాగంలోని ప్రొఫెసర్లు అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, డిప్యూటీ సర్జన్లు, పారా మెడికల్ సిబ్బంది పూర్తిగా సహకరించడం సంతోషంగా ఉందని అభినందించారు. ఈ వీడ్కోలు సన్మాన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సింధియా శుభప్రద, డా. సాయి సుధీర్, డా.విజయ ఆనంద్ బాబు, అసోసియేట్ ప్రొఫెసర్ డా. అరుణ, డా. రేణుక, ఏపీజి డిఏ నాయకులు డాక్టర్ మాధవి, శ్యామల, డా. ఖమ్మం శ్రీనివాసులు, డా. శ్రీరాములు, డిప్యూటీ సూపరింటెండెంట్ డా.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



డా.సుధాకుమారి దంపతులను సన్మానించిన కెఎంసి ప్రిన్సిపల్, సూపరింటెండెంట్ తదితరులు

## విభిన్న ప్రతిభావంతుల్లో మనో ధైర్యం పెంచేందుకు క్రీడలు దోహదం..


**-విభిన్న ప్రతిభావంతుల క్రీడా పోటీలను ప్రారంభించిన డాక్టర్ రవికృష్ణ**

**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్ :** విభిన్న ప్రతిభావంతుల్లో మనో ధైర్యం పెంచేందుకు క్రీడలు దోహద పడతాయని డాక్టర్ రవి కృష్ణ అన్నారు. గురువారం రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ నంద్యాలలోప్రపంచ విభిన్న ప్రతిభావంతుల క్రీడా పోటీలను నంద్యాల లోని నవజీవన్ స్పెషల్ స్కూల్లోవాలీబాల్ షాట్ పుట్ షటిల్ బ్యాట్మెంటన్ వీల్ చైర్ రేస్ 100 మీటర్స్ రన్ షాట్ పుట్ వంటి క్రీడలలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఇందులో విభిన్న ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని వారి యొక్క ప్రతిభ కనబరిచారు. గెలుపొందినవారికి డిసెంబర్ మూడవ తేదీ టౌన్ హాల్లో జరుగు విభిన్న ప్రతిభావంతుల ప్రపంచ దినోత్సవంవేడుకలలో బహుమతి ప్రధానం చేయడం జరుగుతుందని నంద్యాల జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎం ఎన్ వి రాజు తెలిపారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా డాక్టర్‌రవికృష్ణ హాజరై వారికి ప్రోత్సహించి క్రీడలలో అత్యున్నత స్థాయికి చేరాలని తన వంతు సహాయసహకారాలు ఉంటాయని తెలియజేశారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్ రెడ్డిపాల్గొని క్రీడాకారులకు అవసరమైన నైపుణ్యాభివృద్ధి పెంపొందించడానికి తన వంతు కృషిఎల్లవేళలా ఉంటుందని తెలియజేశారు ఈ పోటీలలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎం.ఎన్.వి. రాజుజిల్లా పారాస్పోర్ట్స్ అసోసియేషన్ సెక్రటరీ రమణయ్య నవజీవన్ స్పెషల్ స్కూల్ కరస్పాండెంట్‌సోషల్ వర్కర్ సిస్టర్ జాన్ మేరీ స్పెషల్ స్కూల్ ఫౌండర్ ఫాదర్ మర్రెడ్డి హెచ్ఎం మిస్సెస్ పద్మపిఈటి సుంకన్న భాస్కర్ నవజీవన్ స్కూల్ సిబ్బంది మరియు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థశిక్షకులు సిబ్బంది పాల్గొన్నారు.



## ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టండి

**బనగానపల్లెరూరల్‌మేజర్,న్యూస్:** ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులను చేపట్టి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని నంద్యాల జిల్లా డిపిఒ లలితాబాయ్ అన్నారు. గురువారంనాడు డిపిఒ లలితాబాయ్ బనగానపల్లె పారిశుధ్య పనులను అకస్మాత్తుగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు చేపట్టి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. బనగానపల్లె పట్టణం స్వచ్ఛ బనగానపల్లెగా తీర్చిదిద్దాలని పారిశుధ్య విషయంలో రాజీపడేది లేదని అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బనగానపల్లె పంచాయితీ అధికారులు తెలిపారు.



# కన్నీరు తుడవని కూటమి ప్రభుత్వం ఇకనైనా మేల్కోవాలి

**– మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి**

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** అధిక వర్షాల కారణంగా రైతన్నలు సాగుచేసిన పంటలు తీవ్రంగా నష్టపోవడంతో రైతన్నలు కంట కన్నీరు పెడుతున్నారని నంట నష్టంతో గిట్టుబాటు ధరలు లేక అన్నదాత కన్నీరు పెడుతున్నా కూటమి ప్రభుత్వం తుడవడం లేదని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. గురువారం నంద్యాల మండలం ఎన్‌కొత్తపల్లె గ్రామంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ చేపడుతున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామస్థాయి కమిటీలు ఏర్పాటుపై కార్యాచరణ నిర్వహించి నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ఈకార్యక్రమంలో వైసీపీ నాయకులు బాల వెంకటరెడ్డి, శ్రీనివాసరెడ్డి, సూర్యచంద్రారెడ్డి, దాల్‌మిల్ అమీర్, ఎంపీపీ శెట్టి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా శిల్పా రవి మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పాత, కొత్త కలయికతో పార్టీని మరింత ముందుకు తీసుకుని వెళ్లడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరంన్నర కాలం కావస్తున్నా రాష్ట్రం అభివృద్ధి పథంలో వెనుకంజ వేస్తున్నదని విమర్శించారు. దేశానికి వెన్నముక లాంటి రైతన్నలకు అండగా ఉండాల్సిన కూటమి ప్రభుత్వం రైతన్నల కన్నీరును తుడవని కూటమి నేతలు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. రైతులకు


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి

పంట నష్టపరిహారాన్ని నేటికి అందించలేదని ఇన్‌పుట్ సబ్సిడీలను కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు రోడ్డు ఎక్కుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని రైతుల పక్షాన నిలిచి వారికి పంట పరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. నంద్యాలలో వైసీపీ ప్రభుత్వంలో మెడికల్ కళాశాల, ఆసుపత్రి, అర్బన్ హెల్త్ సెంటర్లు, గ్రామ సచివాలయాలు, మిల్క్ సెంటర్లు, సిసి రోడ్లు, డ్రైన్లు అనేక విధాలుగా అభివృద్ధి చేపట్టామని తెలిపారు. నేడు జిల్లా కేంద్రంలో జిల్లా ఉన్నతాధికారులు వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన గృహాలలో, కార్యాలయాలలో ఉన్నారని గుర్తు చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ప్రజల మేలుకోరి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని రైతన్నలను ఆదుకోవాలని కోరారు.

# డీజిల్ ఇంజన్ల దొంగలను పట్టుకున్న రైతులు


గ్రామాల రైతులు, రైతులు అదుపులోకి తీసుకున్న ఆటో(ఇన్‌సెట్‌లో)

**వెల్దుర్తి, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని గోకులపాడు రహదారిలో గల హంద్రీకాలువ వద్ద రైతులు వ్యవసాయ సాగుకోసం ఏర్పాటు చేసుకున్న డీజిల్ ఇంజన్లను అపహరించేందుకు వచ్చిన దొంగలను నార్లాపురం, మల్లెపల్లి, టి.గోకులపాడు గ్రామాలకు చెందిన రైతులు గురువారం పట్టుకున్నారు. గతంలో కూడా దాదాపు 12 డీజిల్ ఇంజన్లను అపహరణకు గురికావడంతో రైతులు ఈ ప్రాంతంలో నిఘా ఉంచారు. ఈక్రమంలో ఆటోలో ముగ్గురు వ్యక్తులు టి.గోకుల్‌పాడు రహదారిలోని కాల్వ వద్ద ఉన్న మోటర్లను అపహరించేందకు ప్రయత్నించారు. నార్లాపురం గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసులు డీజిల్ ఇంజన్ తీగలు కత్తిరిస్తుండగా రైతులు గుర్తించారు. రైతులు రావడాన్ని పసిగట్టిన ఇద్దరు వ్యక్తులు పరారీ అయ్యారు. ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని వారు తెచ్చుకున్న ఆటోను వెల్దుర్తి పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ విషయంపై రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రైతుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపడుతున్నారు.

# ప్రకృతి వ్యవసాయమే..లాభసాటి వ్యవసాయం

**– వ్యవసాయ శాస్త్రవేత్తలు వెంక టరమణమ్మ, మల్లేశ్వర రెడ్డి, హేమలత**

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** పంటల సాగులో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గింగి సేంద్రియ ఎరువులు వాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల లాభసాటిగా ఉంటుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు డా. వెంకటరమణమ్మ, మల్లేశ్వర రెడ్డి, హేమలతలు అన్నారు. గురువారం రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ముష్టపల్లి, సిద్ధపల్లె, కరివేన గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ రైతులను రాజుగా చూడాలన్న సంకల్పంతోనే రైతన్న మీకోసం కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. పంటల సాగులో రసాయన ఎరువులు, పురుగు మందుల వాడాకాన్ని తగ్గించి పూర్వకాలంలో చేసిన విధంగా పశువుల పేడ లాంటి సేంద్రియ ఎరువులతో పంటలు సాగు చేయడం వల్ల పెట్టుబడి దగ్గి దిగుబడి పెరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన


ప్రకృతి వ్యవసాయంపై రైతులకు వివరిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

ధాన్యం వాడకం ఆరోగ్యంగా ఉండడంతో పాటు మార్కెట్‌లో మంచి ధర పలుకుతుందన్నారు. ప్రతి ఒక్క రైతు ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ముందుకు రావాలని దాని వల్లే కలిగే లాభాలా గురించి వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, ఆయా గ్రామాలకు చెందిన రైతులు పా ల్గొన్నారు.

## బాధితులకు ఆర్థిక సాయం అందజేసిన మాజీ ఎమ్మెల్యే



**నంద్యాల అర్బన్, మేజర్ న్యూస్ :** విద్యుదాఘాతంతో నిరాశ్రయులైన కుటుంబానికి తన వంతు ఆర్థిక సాయంగా మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణానికి చెందిన పెద్దక్క ఇల్లు బుధవారం విద్యుదాఘాతంతో పూర్తిగా కాలిపోయిందని తెలిపారు. గృహోపకరణాలు, డబ్బులు దగ్ధమై కట్టుబట్టలతో రోడ్డుపై ఉన్నారని అన్నారు. తనవంతు సాయంగా ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు. అదే విధంగా శిల్పా సూపర్ మార్కెట్ ద్వారా నిత్యావసర సరుకులు అందించి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని తెలిపారు. నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విజయేశ్వర్ రెడ్డి, జయప్రకాష్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు కిరణ్‌కుమార్, జాకీర్, అమృతరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు
# గురురాజ విద్యార్థులు ఎంపిక



**నంద్యాల అర్బన్, మేజర్ న్యూస్ :** 69వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ హ్యాండ్‌బాల్ పోటీలకు గురురాజ పాఠశాల విద్యార్థి గురునితిన్ రాయల్ ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ షేక్షావలి రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 31వ తేదీ కర్నూలు ఔట్‌డోర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన హ్యాండ్‌బాల్ పోటీలలో అండర్ 14 విభాగంలో గురునితిన్ రాయల్ చక్కటి ప్రతిభ కనబరిచాడని తెలిపారు. ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు చిత్తూరు జిల్లా కలిగిరిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని అభినందించారు.

## చాగలమర్రి అయ్యప్ప దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే పూజలు

**చాగలమర్రి,మేజర్ న్యూస్ :** వైఎస్సార్సిపి ఆళ్లగడ్డ మాజి ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డితో పాటు అయ్యప్ప మాల ధరించి 41 రోజుల పాటు మండల దీక్ష పూర్తి చేసుకున్న అయ్యప్ప మాలాధారులు గోపాలరెడ్డి, నరేంద్రారెడ్డి, విష్ణువర్ధన్రెడ్డి, సాకేత్రెడ్డిలు గురువారం తెల్లవారు జామున చాగలమర్రిలోని అయ్యప్ప స్వామి ఆలయానికి చేరుకొన్నారు. వీరికి


ఇడుముడి ధరించి కొండ కెళ్ళిన మాజీ ఎమ్మెల్యే రంగుల బిజేంద్రారెడ్డి

అయ్యప్ప స్వామి ఆలయ సేవా సమాజం ప్రధాన కార్యదర్శి మదళ్ళపల్లె లక్ష్మీనారాయణ, ఐడియా బాబులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం గురుస్వాములు పోరుమామిళ్ళ ప్రతాప రాయుడు, వందవాసి నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఇరుముడితో శబరిమలైలోని అయ్యప్ప స్వామి సన్నిధానానికి బయలుదేరి వెళ్ళారు. వీరికి ఎంపీపీ వీరభద్రుడు, మండల పార్టి కన్వీనర్ జి. కుమార్రెడ్డి. ఉప సర్పంచ్ షేక్.మహమ్మద్ సోహెల్, ఎంపీటిసి లక్ష్మీరెడ్డి, జిల్లా మైనారీటి సెల్ అధ్యక్షుడు షేక్.షబ్బీర్, మాజి జెడ్పిటిసి సభ్యుడు టి. రామగుర్విరెడ్డి, రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి వెంకటరమణ, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు జి.గణేష్రెడ్డి. పార్టి మండల ఉపాధ్యక్షుడు ముల్లా ఖాదర్ బాష, మండల ప్రధాన కార్యదర్శి శేషు రమేష్. ప్రచార కార్యదర్శి రఫి, నాయకులు మనోహర్రెడ్డి, కెకె రెడ్డి, సర్పంచ్ గోవిందయ్య. రంగయ్య. బచ్చు సుబ్రమణ్యం, వార్డు మేంబర్లు ముల్లా బురాందీన్, ఫ్రూట్ షేక్షావలిలు పూలమాలలు వేసి గంగుల బ్రిజేంద్రారెడ్డికి ఘనంగా విడ్కోలు పలికారు.

# కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

**– కాంగ్రెస జిల్లా అధ్యక్ష పదవికి అవకాశం కల్పించాలి**


మాట్లాడుతున్న కాంగ్రెస్ ఇంఛార్జీ

**పత్తికొండ,మేజర్ న్యూస్ :** కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఏఐసీసీ అబ్జర్వర్ యోగేష్, పిసిసి అబ్జర్వర్ సాకే శంకర్‌లు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక వాసవి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సంఘటన్ శ్రీజన్ అభియాన్ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా వారు పాల్గొని మాట్లాడుతూ, బిజెపి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు తీరని నష్టం జరుగుతుందన్నారు. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి విస్తృతంగా కృషి చేసి పార్టీకి పూర్వ వైభవాన్ని తీసుకురావాలన్నారు. అనంతరం నియోజకవర్గ ఇంచార్జీ క్రాంతి నాయుడు మాట్లాడుతూ, జిల్లాలో వలసల నివారణ చర్యలు చేపట్టి, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. పత్తికొండలో టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు, విద్యా, వైద్య రంగాల్లో మౌళిక సదుపాయలు కల్పించాలన్నారు. జిల్లా అధ్యక్ష పదవికి తమకు అవకాశం కల్పించాలని జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గాల కో–ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

# ఐసిడిఎస్ అధికారులు సమగ్ర విచారణ జరపాలి

**ఆదోని, మేజర్ న్యూస్ :** ఈనెల 10వ తేదిన అంగన్‌వాడి వర్కర్, ఆయాను తొలగించడం అన్యాయమని, ఈ విషయాన్ని ఐసిడిఎస్ అధికారులు సమగ్ర విచారణ జరపాలని అంగన్‌వాడి గౌరవ అధ్యక్షులు వీరేష్, రాష్ట్ర సమితి సభ్యురాలు జానకి, అర్బన్ అధ్యక్షురాలు ఈరమ్మలు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఏఐవైఎఫ్ కార్యాలయంలో అర్బన్ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అంగన్‌వాడి గౌరవ అధ్యక్షులు వీరేష్ మాట్లాడుతూ, అంగన్‌వాడి–2 సెంటర్‌లో ప్రభుత్వం ద్వారా సరఫరా చేసిన పాలును తాగిన తరువాత కొంతమంది విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం పాఠకులకు విధితమే. ఈ ఘటనపై ఐసిడిఎస్ అధికారులు సమగ్ర విచారణ నిర్వహించకుండా, తొందరపాటుతో ఉద్యోగం నుండి తొలగించడం అన్యాయమన్నారు. కావున ఆ నిర్ణయాన్ని రద్దు చేసి వర్కర్‌ను, ఆయాను విధుల్లోకి తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరుతున్నాము. ఈ సమావేశంలో అర్బన్ కార్యదర్శి శారద, అర్బన్ కోశాధికారి గీత, ప్రభావతి, శంకరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# కుష్టు వ్యాధి రహిత సమాజాన్ని ఏర్పాటు చేయాలి

**కర్నూలు వైద్యం, మేజర్‌న్యూస్ ః**

కర్నూలు జిల్లాను కుష్టివ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దడం మనందరి బాధ్యత అని జిల్లా వైద్యాధికారి డాక్టర్ భాస్కర్, డా.పి శాంతిరాంలు అన్నారు. గురువారం కుష్టువ్యాధి సర్వేపై సమావేశం ఏర్పాటు చేసి సంబంధిత అధికారులను ఆరాతీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే సమయంలో వివరాలను సేకరించి ప్రభుత్వం అందించే వైద్య సేవలను ప్రజలకు తెలియజేయాలన్నారు. వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత లేకుండా ప్రజల్లో వైద్య సిబ్బంది అవగాహన తీసుకుని రావాలన్నారు. గృహ సందర్శనాలలో స్పర్శలేని మచ్చల గురించి ప్రజలకు తెలియజేస్తూ నమోదు చేయాలన్నారు. కుష్టివ్యాధి మచ్చలను గుర్తిస్తే పరీక్షలు చేయించి నిర్ధారణ అయితే చికిత్స అందించాలన్నారు. ఈ వ్యాధి మొదటి దశలోనే చికిత్స చేస్తే ఖచ్చితంగా వ్యాధి నయమవుతుందని తెలిపారు. ఆశా, ఆరోగ్య కార్యకర్తలు నమోదు చేసిన స్పర్శలేని మచ్చల వ్యక్తులను సంబంధిత వైద్యాధికారి చేత చికిత్స ప్రోత్సహించాలన్నారు. వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అందించే పథకాల గురించి వివరించాలని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కుష్టువ్యాధి సర్వేకు వచ్చిన అధికారులకు ప్రజలు సలహాకరించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు డా.వి శాంతారామ్, కేంద్ర బృందం సభ్యులు, డాక్టర్ రీతి తివారి, డాక్టర్ మాన్సి, రాష్ట్ర స్థాయి అధికారి డాక్టర్ దేవసాగర్, కన్సల్టెంట్ సత్యవతి, న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మల్లికార్జున రెడ్డి, డిపిఎంఓ సుబ్రమణ్యం, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

APPSC,TGPSC UPSC CIVIL SERVICES EXAMS SPECIAL

# భారత దేశంలో స్థానిక ప్రభుత్వాలు

(గత వారం తరువాయి...)

అత్యంత వెనుకబడిన ప్రాంతాలలో ప్రజలు తమ సమస్యలు, అవసరాలను తామే గుర్తించడం, వాటి పరిష్కారానికి అవసరమైన మార్గాలను ఎంచుకొనే స్వేచ్ఛను ఇవ్వడం ద్వారా దేశంలో వినూత్న ఆలోచనలకు పునాదులు వేసినట్లయింది. అమెరికాకు చెందిన ఫోర్డ్ ఫౌండేషన్ సహకారంతో ప్రారంభించిన సాముదాయకాభివృద్ధి కార్యక్రమం గ్రామీణాభివృద్ధికి అత్యంత కీలకమైన వ్యవసాయాభివృద్ధి, నీటి పారుదల, పశు సంపద అభివృద్ధి, కుటీర పరిశ్రమల అభివృద్ధి, గృహ వసతి కల్పన, విద్య, ఆరోగ్యం, స్త్రీ, శిశు సంక్షేమం కోసం వివిధ కార్యక్రమాలను చేపట్టడం జరిగింది.

సాముదాయకాభివృద్ధి కార్యక్రమాన్ని అమలు చేసేందుకుగాను జిల్లాను బ్లాకులుగా విభజించారు. ఒక్కొక్క బ్లాకులో లక్ష జనాభా కలిగిన దాదాపు వంద గ్రామాలు ఉంటాయి. ఒక్కొక్క బ్లాకుకు ఒక బ్లాక్ డెవలప్మెంట్ ఆఫీసర్ ఆధ్వర్యంలో (ప్రస్తుతమున్న మండల అభివృద్ధి అధికారికి సమానం) విస్తరణాధికారులను నియమించడం జరిగింది. ఈ అధికారులు గ్రామీణాభివృద్ధికి అవసరమైన ఆధునిక అభివృద్ధిదాయక విధానాల గురించి ప్రజలకు తెలియచేయడం జరుగుతుంది. దీనికిగాను పది గ్రామాలకు ఒకరు చొప్పున ఒక గ్రామ సేవకుని నియమించడం జరిగింది. వీరు ప్రజలతో కలిసి తిరుగుతూ నిపుణులకు ప్రజలకు మధ్య వారధిగా వ్యవహరించడం జరిగింది.

స్వల్ప వ్యవధిలో విస్తృత ప్రాంతంలో సామాజికాభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు గాను 1953 అక్టోబర్ 2న జాతీయ విస్తరణ సేవా కార్యక్రమాన్ని దేశ వ్యాప్తంగా ప్రవేశపెట్టడం జరిగింది. ఒక విధంగా ఇది సాముదాయకాభివృద్ధి కార్యక్రమాన్ని దేశమంతటా విస్తరింపచేసేందుకు ఉద్దేశించిన పథకం అని చెప్పవచ్చు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణాభివృద్ధికి దోహదంచేసే సేవా కార్యక్రమాలను చేపట్టారు. తద్వారా వ్యవసాయంలో అధిక దిగుబడినిచ్చే వంగడాల వాడకం, నూతన వ్యవసాయ పద్ధతులను అవలంబించడం వంటి పరిజ్ఞానాన్ని గ్రామీణ ప్రజలకు అందజేయడం జరిగింది.

సాముదాయకాభివృద్ధి కార్యక్రమం, జాతీయ మరియు విస్తరణ సేవా కార్యక్రమం గ్రామీణాభివృద్ధికి దోహదపడేందుకు ప్రవేశపెట్టబడినప్పటికీ వివిధ కారణాల వల్ల వాస్తవంలో మాత్రం ఈ కార్యక్రమాలు పూర్తి స్థాయిలో విజయవంతం కాలేకపోయాయి. ముఖ్యంగా స్థానిక ప్రజలు గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల రూపకల్పన, వాటి అమలులో భాగస్వాములు కాకపోతే అవి విజయవంతం కావని ఈ కార్యక్రమాల అనుభవాల వల్ల వెల్లడయ్యింది.

సాముదాయకాభివృద్ధి కార్యక్రమం మరియు జాతీయ విస్తరణ సేవా కార్యక్రమాలను సమర్ధవంతంగా అమలు చేసేందుకుగాను తీసుకోవాల్సిన చర్యలను సూచించేందుకు గాను జాతీయ అభివృద్ధి మండలి (NDC) రూపొందించిన ప్రణాళికా విధాన కమిటీ సూచనల మేరకు కేంద్ర ప్రభుత్వం 1957లో బల్వంత్ రాయ్ మెహతా అధ్యక్షతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమాల అమలు తీరును, వాటి ప్రభావాన్ని అధ్యయనం చేసిన బల్వంత్ రాయ్ కమిటీ గ్రామీణాభివృద్ధిలో స్థానిక సంస్థల పాత్ర అత్యంత కీలకమైనదని సిఫార్సు చేయడం జరిగింది.

సామాజిక సమస్యలను, బాధ్యతలను తాము ఎన్నుకొన్న ప్రజాప్రతినిధులతో స్థానిక సంస్థలు అధికారాలను చలాయిస్తూ వాటిని పర్యవేక్షించ గలిగే స్థాయి, అవకాశం ఉన్నప్పుడే సమాజ వికాస అభివృద్ధి కార్యక్రమాల వాస్తవిక లక్ష్యం నెరవేరుతుందని, అదికారం, బాధ్యత లేకుండా అభివృద్ధి ఒక్కటే ప్రగతిశీలమైంది కాదని అభిప్రాయపడిన బల్వంత్ రాయ్ మెహతా కమిటీ వికేంద్రీకరణ పరిపాలనా యంత్రాంగానికి అనగా స్థానిక సంస్థలకు అవసరమైన అధికారాలను, వనరులను బదలాయించాలని సిఫార్సు చేయడం జరిగింది.

బల్వంత్ రాయ్ మెహతా కమిటీ తన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తూ "స్థానిక ఆసక్తులతో ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంలో స్థానిక సంస్థలు ఏర్పడి స్థానిక అవసరాలను తీర్చే ఆర్థిక స్థోమతను వాటికి కలిగించగలిగినపుడే గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుందని, జిల్లా ప్రణాళికా కమిటీలు, బ్లాక్ సలహా సంఘాల స్థానంలో ప్రజాస్వామ్య వికేంద్రీకరణ విధానాన్ని ప్రవేశపెట్టాలని పేర్కొనడం జరిగింది. బల్వంత్ రాయ్ మెహతా కమిటీ సిఫార్సులను 1958లో జాతీయ అభివృద్ధి మండలి ఆమోదించింది. అనంతరం 1959లో స్థానిక ప్రభుత్వాల కేంద్ర స్థాయి మండలిని పంచాయతీ రాజ్ పేరుతో ప్రారంభించి గ్రామీణ స్థానిక ప్రభుత్వాల ఏర్పాటుకు మార్గదర్శక సూత్రాలను రూపొందించడం జరిగింది. గ్రామీణ ప్రజలకు విస్తృత స్థాయిలో




పరిపాలనా భాగస్వామ్యాన్ని కల్పించేందుకు, సేవలను విస్తృత పరిచేందుకు అవసరమైన పరిపాలనా యంత్రాంగాన్ని నిర్మించడమే పంచాయతీరాజ్ సంస్థల అంతిమ లక్ష్యం.

**పంచాయతీరాజ్ వ్యవస్థ ఆశయాలు:**

1. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలలో ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం.
2. ప్రజాస్వామ్య వికేంద్రీకరణ ఆధారంగా పరిపాలనను అందించేందుకు అవసరమైన సంస్థలను రూపొందించడం.
3. సామాజిక, రాజకీయ మార్పుకు సాధనంగా పనిచేయటం.
4. స్థానిక స్థాయిలలో సమీకరణ ప్రక్రియలకు తోడ్పడటం.
5. అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి సంబంధిత ప్రాంతాలలో అమలుచేయడం వంటి ఆశయాల సాధనకుగాను పంచాయతీరాజ్ వ్యవస్థను ఏర్పాటుచేశారు.

బల్వంత్ రాయ్మెహతా కమిటీ మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను సిఫార్సు చేసినప్పటికీ అనేక రాష్ట్రాలలో స్థానిక పరిస్థితుల దృష్ట్యా ఒకే అంచె, (జమ్మూ కాశ్మీర్), రెండు అంచెలు (పంజాబ్, ఒరిస్సా), నాలుగు అంచెలు (పశ్చిమ బెంగాల్), గిరిజన కౌన్సిల్స్ (నాగాలాండ్, మేఘాలయ) వంటి వేర్వేరు స్థాయిలు గల పంచాయితీరాజ్ వ్యవస్థలు నెలకొల్పబడ్డాయి.

దేశంలో పంచాయతీరాజ్ వ్యవస్థ పరిణామ క్రమంలోని మొదటి దశలో (1959-1966) దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాలలో వివిధ అంచెలలో పంచాయితీ సంస్థలు ఏర్పాటు చేయబడగా, రెండవ దశలో (1967-1976), గ్రామీణాభివృద్ధికి వెన్నుముక అయిన వ్యవసాయ అభివృద్ధికి అధిక ప్రాధాన్యతను ఇవ్వడం జరిగింది. దీనికిగాను సమగ్ర వ్యవసాయాభివృద్ధి కార్యక్రమాలను మరియు గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలుగా రూపొందించి గ్రామ స్థాయిలో అమలుచేయడం జరిగింది. మూడవ దశలో (1977-1991) పంచాయతీ రాజ్ సంస్థలలో సంస్థాగత సంస్కరణలు (Institutional Reforms) చేయబడ్డాయి. ఈ దశలోనే పంచాయతీరాజ్ వ్యవస్థను సమగ్రంగా అధ్యయనం చేసి వాటిలోని లోపాలను సవరిస్తూ, నూతన మార్పులు చేపట్టే ఉద్దేశంతో 1977లో నాటి జనతా ప్రభుత్వం అశోక్ మెహతా అధ్యక్షతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కమిటీ పంచాయతీరాజ్ సంస్థల పనితీరును క్షుణ్ణంగా సమీక్షించి అనేక సిఫార్సులతో కూడిన నివేదికను 1978లో కేంద్ర ప్రభుత్వానికి సమర్పించడం జరిగింది.

ప్రణాళిక సంఘం 1985లో గ్రామీణాభివృద్ధి మరియు పేదరిక నిర్మూలన పథకాల అమలుకు అవసరమైన పాలనా ఏర్పాట్లను సమీక్షించేందుకు గాను జి.వి.కె. రావు అధ్యక్షతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కమిటీ పంచాయతీ రాజ్ వ్యవస్థను పునరుద్దరించి దానిని బలోపేతం చేయగలిగితే గ్రామీణాభివృద్ధి విజయవంతమవుతుందని సిఫార్సు చేయడం జరిగింది. ప్రజాస్వామ్య వికేంద్రీకరణ ప్రాముఖ్యతను గుర్తించిన ఈ కమిటీ రాష్ట్రస్థాయిలోని ప్రణాళికా విధానాలలో కొన్నింటిని జిల్లా ప్రణాళికా విభాగాలకు బదిలీ చేయాలని, జిల్లా అభివృద్ధి కమిషన్ అనే పదవిని కొత్తగా సృష్టించాలని, జిల్లా కలెక్టర్కు పంచాయతీరాజ్ అభివృద్ధి పాలనలో క్రియాశీల పాత్రను కల్పించాలని సిఫార్సు చేయడం జరిగింది.

ప్రజాస్వామ్యం మరియు గ్రామీణాభివృద్ధి కోసం పంచాయతీరాజ్ వ్యవస్థ పునర్ వ్యవస్థీకరణకు సంబంధించి తగిన సిఫార్సులను చేసేందుకు గాను కేంద్ర ప్రభుత్వం 1986లో ఎల్.ఎమ్ సింఘ్వీ అధ్యక్షతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కమిటీ పంచాయతీరాజ్ వ్యవస్థలకు రాజ్యాంగబద్ధత ఉండాలని, గ్రామస్థాయిలో న్యాయ పంచాయతీలను, గ్రామసభలను ఏర్పాటు చేయాలని, గ్రామ పంచాయతీలకు అధిక నిధులివ్వాలని, పంచాయతీ ఎన్నికలు, వాటి రద్దు వివాదాల పరిష్కారానికి గాను ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేయాలని సిఫార్సు చేయడం జరిగింది.

నాల్గవదశలో (1992 నుండి) అత్యంత కీలకమైన 73వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని పార్లమెంట్ ఆమోదించి దేశవ్యాప్తంగా పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పాటును తప్పనిసరిచేస్తూ వాటికి రాజ్యాంగ బద్ధతను కల్పించడం జరిగింది. 1991లో కేంద్ర ప్రభుత్వం 73వ రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంట్లో ప్రవేశపెట్టగా 1992 డిసెంబర్ 23న ఈ బిల్లుకు ఆమోదం లభించింది. అనంతరం తగినన్ని రాష్ట్రాల చట్టసభల ఆమోదం కూడా పొందిన తరువాత 1993 ఏప్రిల్ 24 నుండి 73వ రాజ్యాంగ సవరణ చట్టం దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చింది. ఈ సవరణను రాజ్యాంగంలోని 9వ భాగంలోని నిబంధన 243 కింద చేర్చడం జరిగింది. 243, 243ఎ నుండి 243ఓ వరకు గల 16 నిబంధనలలో పంచాయతీరాజ్ వ్యవస్థకు సంబంధించిన అన్ని అంశాలను స్పష్టంగా నిర్వచించడం జరిగింది.

73వ రాజ్యాంగ సవరణ చట్టంలోని 243జి నిబంధన ప్రకారం గ్రామ పంచాయతీల కోసం ప్రత్యేకంగా 11వ షెడ్యూల్ను ఏర్పాటుచేసి దీనిలో పంచాయతీలకు సంబంధించిన 29 అధికారాలు మరియు విధులను చేర్చడం జరిగింది. దీనిలో వ్యవసాయం, భూమి అభివృద్ధి, భూసంస్కరణలు మొదలు పేదరిక నిర్మూలన, కుటుంబ సంక్షేమం వంటి గ్రామీణాభివృద్ధికి తప్పనిసరిగా ఉపయోగపడే అంశాలను చేర్చడం భారతదేశ గ్రామీణాభివృద్ధి చరిత్రలో మరో మైలురాయి అని చెప్పవచ్చు.

ప్రజారోగ్యం - పారిశుద్ధ్యం

1. మానవ వనరుల అభివృద్ధి కార్యాచరణ కమిటీ సభ్యులను ప్రోత్సహించి ప్రజలలో ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్యం పట్ల అవగాహనను పెంపొందించాలి.
2. వీధుల వారి పారిశుద్ధ్య కమిటీలను ఏర్పాటు చేసి గృహపారిశుద్ధ్యం వ్యక్తిగత పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్మాణం మరియు వినియోగం, క్లోరినేషన్ జరిపిన నీటి వాడకం వంటి అంశాలను ప్రచారం చేసి ప్రజలు వాటిని పాటించే విధంగా చేయాలి.
3. ఆరోగ్య సిబ్బంది ద్వారా అవగాహన సదస్సులను తరుచూ నిర్వహించడం
4. మురికి నీరును రోడ్లపైన వదులుట పై నిషేదం విధించుట
5. మురికి నీటి కాల్వలు జలదారుల పై కట్టడాలను నిషేదించడం
6. ప్రజారోగ్యానికి హాని కలిగించే యంత్రాలతో నడిచే కర్మాగారాల పై నియంత్రణ విధించడం, అవసరమైతే నిషేదించడం
7. కళేబరాల నిర్వహణకు లైసెన్సులిచ్చుట, నియంత్రించుట
8. మెదడువాపు వ్యాధి వ్యాప్తి చెందకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం. దోమలను నిర్మూలించడానికి క్రిమిసంహారక మందులను పిచికారి చేయడం
9. పందులను, కుక్కలను నియంత్రించడం
10. స్మశాన వాటికలను ఏర్పాటుచేయడం, ప్రైవేటు స్మశాన వాటికల రిజిస్ట్రేషన్ లైసెన్సివ్వడం, అధికారిక అనుమతి లేని స్థలాలలో ఖననాన్ని నిషేధించుట.



Dr. P. Harish,
Director
Perfect Academy,
Hyderabad.

# కుష్టు వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** కుష్టు వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర కుష్టువ్యాధి నిర్మూణ బృందం సభ్యులు శాంతరామ్, రీతీతేశ్వరి, మనిషా, రాష్ట్ర కష్టు వ్యాధి నిర్మూలన జాయింట్ డైరెక్టర్ దేవసాగర్ సత్యవతి అన్నారు. గురువారం మండల కేంద్రమైన గోనెగండ్లలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను కుష్టువ్యాధి నిర్మూలన బృంధం తనిఖీ చేశారు. రికార్డుల ను పరిశీలించారు. మండలంలో కుష్టువ్యాధి సర్వే పనులు ఏలా జరుగుతున్నాయని తెలుసుకున్నారు. నవంబరు 11 నుంచి 30 తేది వరకు ఈ ఇంటింట సర్వే నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సర్వే మండలంలో ఎలా జరుగుతుందని వైద్యురాలు రంగరవళిని అడిగి తెలుసుకున్నారు. కుష్టు వ్యాధి సోకిన వ్యక్తిని వారు పరిశీలిం చారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ చర్మం పై స్పర్శలేక పోవడ రాగి రంగు గల మచ్చలు, చర్మము పొడిగా ఉండటం, కనురెప్పల పై ఉన్న వెంట్రుకలు రాలిపోవడం, కన న్నలు మూత పడక పోవడం, చర్మం మందం కావడం, అరచేతులు, కాళ్లు బొబ్బలు రావడం, చేతి వేళ్లు, కాలివేళ్లు వంకర పోవడం వంచి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆసపత్రిలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఉచితంగా మందులు ఇస్తారని తెలిపారు. పలు ఆరోగ్య సూత్రలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్తిర సిబ్బంది పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న కేంద్ర కుష్టువ్యాధి నిర్మూలన బృంధం

# ఐచర్ వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్‌:** పట్టణ సమీపంలోని డోన్ రైల్వేగేట్ దగ్గర ఉన్న 44వ నెంబర్ జాతీయ రహదారిపై గురువారం ఐచర్ వాహనం ఢీకొని ద్విచక్రవాహన దారుడు ఇష్టు బోయ మహేష్‌కు తీవ్ర రక్తగాయాలు కావడంతో హైవే ఆంబులెన్స్ లో వెల్దుర్తి సిహెచ్‌సి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు చికిత్స చేస్తుండగా కోలుకోలేక బోయ మహేష్(31) మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అనంతరం ఆసుపత్రి నందు మహేష్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మృతుడి కుటుంబ సభ్యులకు అందిస్తామని వైద్యులు తెలిపారు. మృతుడికి సంబందించి పూర్తి వివరాలు మండల పరిధిలోని మల్లెపల్లి గ్రామానికి చెందిన బోయ మహేష్ వెల్దుర్తి గ్రామానికి పని కోసం వచ్చి స్వగ్రామానికి తిరుగు ప్రయాణంలో తన ద్విచక్రవాహనంపై రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుండి అనంతపురం వైపు వెళ్తున్న ఐచర్ వాహనం ఢీ కొనడంతో కొన ఊపిరితో ఉన్న మహేష్‌ను స్థానికులు హైవే ఆంబులెన్స్‌కు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రుడికి మెరుగైన వైద్యం కోసం వెల్దుర్తి సిహెచ్‌సి వైద్యశాలకు తీసుకువచ్చారు. క్షతగాత్రుడికి తల్లి కళావతి, భార్య కృష్ణవేణి, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు సమాచారం.




# తిమ్మాపురంలో ఏజి విద్యార్థుల జాతీయ సేవా పథకం

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది మండలంలోని తిమ్మాపురం గ్రామంలో వారం రోజుల పాటు ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ కళాశాల విద్యార్థులు జాతీయ సేవా పథకం కార్యక్రమాలను నిర్వహిస్తారని ఇన్‌చార్జ డా.పి.ఉమామహేశ్వరీ తెలిపారు. గురువారం ప్రారంభ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిధులుగా ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ డా.కె.స్వరాజ్య లక్ష్మీ, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మణరావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ సేవా పథకం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థులు సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలని అన్నారు. గ్రామంలో పాఠశాలలు, తదితర ప్రదేశాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎలిమెంటరీ స్కూల్ హెడ్‌మాస్టర్ మద్దిలేటి, గ్రామ ఉప సర్పంచు రేష్మ, మాజీ సర్పంచు కోటయ్య, ఉల్లి మధు, ప్రొఫెసర్లు డా.వై.మాధవి, సింధూజ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ డా.స్వరాజ్య లక్ష్మీ

# నాబార్డ్ నిధులతో సంత మార్కెట్‌కు భూమి పూజ

**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని పారుమంచాల గ్రామంలో రూ.15.50 లక్షల నాబార్డ్ నిధులతో కూరగాయల మార్కెట్ నిర్మాణానికి స్వచ్ఛంద సేవా సంస్థ శ్రీ పరమేశ్వరీ ఎడ్యుకేషన్ సొసైటి ఆధ్వర్యంలో నాబార్డ్ ఏజిఎం కార్తీక్ దొరై, గ్రామ సర్పంచు మాధవరం ప్రకాశం, మాజీ ఎంపీపీ వెంకటరమణా రెడ్డి, ఎంపీపీ సువర్ణమ్మలు కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేసి శిలా పలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సమావేశంలో వారు మాట్లాడుతూ నాబార్డ్ ఏజిఎం కార్తీక్ దొరై మాట్లాడుతూ గ్రామ సర్పంచు ప్రకాశం మార్కెట్ కోసం ప్రతిపాదన పంపించారని అలాగే సేవా సంస్థ శ్రీ పరమేశ్వరీ ఎడ్యుకేషన్ వారికి కావాల్సిన డాక్యుమెంట్లు సర్పంచు సకాలంలో అందజేయంతో సంత మార్కెట్ మంజూరు చేయడం జరిగిందని అన్నారు. గ్రామ సర్పంచు ప్రకాశం మాట్లాడుతూ ఈ సంత మార్కెట్ నిర్మాణంతో రైతులకు, ప్రజలకు కష్టాలు తప్పుతాయని అన్నారు. వర్షాకాలంలో ఇబ్బంది పడాల్సిన అవసరం ఉండదని తెలిపారు. త్వరగా నిర్మాణం పూర్తి చేసేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దేవసహాయం, పంచాయతీ కార్యదర్శి షాలుబాషా, చెంచురెడ్డి, రామచంద్రా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న నాబార్డ్ ఏజిఎం, గ్రామ సర్పంచు, ఎంపీపీ

# ఓంకార క్షేత్రంలో ప్లానింగ్ డిపార్ట్మెంట్ జాయింట్ డైరెక్టర్

**బండిఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** నల్లమల అభయారణ్యంలో వెలిసిన ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీ గంగా ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం ఆంధ్రప్రదేశ్ ప్లానింగ్ డిపార్ట్మెంట్ జాయింట్ డైరెక్టర్ పి.శ్రీనివాసులు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి పంచామృతాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ చైర్మెన్ అల్లె చెన్నారెడ్డి ఆలయ మర్యాదలతో వారికి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఏ.నాగప్రసాద్, ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు చక్రపాణి శర్మ, మృగపాణి శర్మ, పాల్గొన్నారు.


స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు

# ఎన్ సి సి యూనిట్ కు ప్రజ్ఞాన్ డిగ్రీ కళాశాల విద్యార్థుల ఎంపిక


ఎన్సిసి విద్యార్థులు సాధన చేస్తున్న దృశ్యం

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** స్థానిక ప్రజ్ఞ డిగ్రీ కళాశాలలో కళాశాల చైర్పర్సన్ హేమలత రెడ్డి, ప్రిన్సిపల్‌శివరామిరెడ్డిల ఆధ్వర్యంలో డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులను ఎన్సిసియూనిట్‌కు ఎంపికచేశారు. ఎన్సిసి అధికారులు సుబేదార్ అలోక్ కుమార్, హవల్దార్ పింజు శర్మా లు విద్యార్థులకు దేహదారుడిగా పరీక్షలు నిర్వహించారు. 109 మంది విద్యార్థులకు గాను 31 మంది 28 ఏ ఎన్ సి సి యూనిట్‌కు క్యాడేట్లుగా ఎంపిక చేశారు. కళాశాల సిటిఓ నాగేంద్ర, రఫీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఓటర్ లిస్టును పది రోజుల లోపు మ్యాపింగ్ చేయాలి

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** వచ్చే పది రోజుల లోపు బీఎల్ వోలు ఆయా గ్రామాలలోని పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్ లిస్టులను మ్యాపింగ్ చేయాలని తహసీల్దార్ రాజేశ్వరి కోరారు. గురువారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని తహసీల్దార్ కార్యాలయం దగ్గర బీఎల్‌వో సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో 68 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని అందులో 68 బీఎల్వోలు ఉన్నారన్నారు. మండలంలో ఇప్పటి వరకు 58,653 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. వీరి ఓటలిస్టును తప్పని సరిగా బీఎల్ వోలు పది రోజుల లోపు మ్యాపింగ్ పూర్తి చేయాలని కోరారు. పలు గ్రామాల బీఎల్‌వో పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

# ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలి


వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

**వెల్దుర్తి, మేజర్‌న్యూస్‌:** పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్(పిపిపి) విధానం పేరుతో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణను ఆపాలి, జీఓ నెంబర్ 590ను వెంటనే రద్దు చేయాలని పిపిపి విధానంతో బడుగు, బలహీన వర్గాల పేద వర్గాల విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయొద్దని ఎన్‌డిఏ కూటమి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ గురువా రం మండల తహశీల్దార్ చంద్రశేఖర్‌వర్మకు రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాయలసీమ రవీంద్రనాథ్, ఏపి స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర సభ్యులు నాగసురేంద్ర యాదవ్‌లు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలకృష్ణనాయక్, సూరి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# సజావుగా సాధారణ సమావేశం

**చాగలమర్రి,మేజర్ న్యూస్:** మండలకేంద్రమైన చాగలమర్రిమేజర్‌గ్రామపంచాయితీ సాధారణ సమావేశం సర్పంచ్ తోలసమ్మ అధ్యక్షతన గురువారం సజావుగా జరిగింది. ఈ సమావేశాన్ని ఈ తారకేశ్వరీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఈఓ తారకేశ్వరీ మా ట్లాడుతూ గ్రామంలో త్రాగునీటి సరఫరా, పారిశుధ్య పనితీరు, వీధి దీపముల సౌకర్యం, ప్రైవేటు కొళాయిల ఏర్పాటుకు, భవన నిర్మాణముల కొరకు వచ్చిన దరఖాస్తుల పరిశీలను వార్డు సభ్యుల సమక్షంలో పరిశీలించి ఆమోదించామన్నారు. సర్పంచ్ అనుమతితో గ్రామం లో ఇతర అభివృద్ధి అంశములపై చర్చించి ఆమోదించడాన్ని పరిశీలించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ షేక్. మహమ్మద్ సోహెల్, వార్డు మేంబర్లు, ముల్లా బురాం దీన్, వలిసాగారి మహబూ షరీఫ్, మన్సూర్, ఆర్ఎస్ రమణ, కొత్తపల్లె షబాన, జయలక్ష్మీ, ఖాజాబి, సచివాలయాల సిబ్బంది. లైటర్, వాటర్మేన్లు తదితరులు పాల్గొన్నారు.



# రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**– టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్రరెడ్డి**

**కోసిగి మేజర్ న్యూస్:** రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలుగు దేశంపార్టీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి అన్నారు. గురువారం కామన్‌దొడ్డి గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆయన పాల్గొన్నారు. రైతులు సుఖ:సంతోషాలతో ఉండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయడు అహర్నిషలు కృషిచేస్తున్నారన్నారు. అలాగే వ్యవసాయంలో విప్లవాత్మకమైన మార్పును తీసుకొచ్చేందుకు ఆధునిక వ్యవసాయ పద్దతులు పాటించాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్, ప్రకృతి వ్యవసాయం, పాడి పరిశ్రమ వంటి అంశాలతో కూడిన పంచసూత్రాలను ప్రవేశపెడుతున్నారన్నారు. రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు వంటి పంటలు పండించడం వల్ల వాటికి మంచి డిమాండ్ ఉంటుందన్నారు. యస్‌సి, యస్‌టిలకు 100శాతంతో సబ్సిడి డ్రిప్ మరియు స్ప్రింకర్‌లు వంటివి ప్రభుత్వం అందిస్తున్నారు. అన్నదాత సుఖీ:భవ కింద 20వేల రూపాయలకుగాను ఇప్పటికి 14వేల రూపాయలు వేయడం జరిగిందన్నారు. అలాగే కూటమి ప్రభ్వుతం రైతుల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు, అదికారులు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న తెలుగు దేశంపార్టీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి

సూర్య

శుక్రవారం | 28 నవంబరు 2025

# కారులో బంగారు నగలు చోరీ

**:- 10తులాల బంగారం ఎత్తుకెళ్లిన అగంతకులు**

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** వెల్దుర్తి గ్రామానికి చెందిన రఘురామిరెడ్డి అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో కలిసి కర్నూలు నగరంలోని జోయాలుకస్‌లో దాదాపు 10తులాల బంగారు నగలను కొనుగోలు చేశాడు. అక్కడి నుండి గాయత్రి ఎస్టేట్‌లోని ఓ డాక్టర్ వద్దకు వెళ్లి పరీక్షలు చేయించుకుని తదనంతరం టుటౌన్ స్టేషన్ పరిధిలోని అమరావతి హోటల్‌లో టిఫిన్ చేసేందుకు కారును రోడ్డుపై పార్కు చేసి టిఫిన్ చేసేందుకు వెళ్లారు. అక్కడి నుండి స్వగ్రామం వెల్దుర్తిలో ఇంట్లోకి వెళ్లే ముందు కారులో బంగారు నగలు చూసుకోగా నగలు కనబడకపోవడంతో తిరిగి కర్నూలు టుటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి బంగారు చోరీకి గురైందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే పోలీసులు నగరంలో పలుచోట్ల తిరగడంతో నగలు ఏ స్టేషన్ పరిధిలోని చోరీకి గురైందో తెలియకపోవడంతో విచారణ చేపడతామని టుటౌన్ పోలీసులు ఆయన ఫిర్యాదును తీసుకున్నారు. దాదాపు 10తులాల బంగారు నగలు అగంతకులు అపహరించుకెళ్లారు. పోలీసులు సిసి ఫుటేజ్‌ల ఆధారంగా విచారణ చేపడుతున్నారు.

## చింతకుంట సొసైటీ ఛైర్మెన్,డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం



సొసైటీ ఛైర్మెన్,డైరెక్టర్లు గా ప్రమాణ స్వీకారం చేసిన నాయకులు

**హొలహర్వి, మేజర్ న్యూస్ :** హొలహర్వి మండలంలోని చింతకుంట సొసైటీ ఛైర్మెన్ గా మోకా ప్రకాష్ డైరెక్టర్ లుగా నాగోతి ప్రసాద్,బిలేహాల్ ఉచ్చీరప్ప లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో రైతులకు అండగా ఉండి వారికి సకాలంలో రుణాలను అందిస్తామని అన్నారు.అలాగే రైతులకు అవసరం అయ్యే ఎరువులు అన్ని సబ్సిడీ ద్వారా అందిస్తామని అన్నారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్ రెడ్డి, కన్వీనర్ శ్రీధర్,నాగరాజు, మారుతి,పూజారి మల్లప్ప,నరసింహ,బసప్పలు పాల్గొన్నారు.

# కల్లుదేవకుంటలో పట్టపగలే దొంగతనం

**– రూ. 70వేలు నగదు, ఐదు తులాల బంగారం, 10తులాల వెండి ఆపహరణ– ఎస్.ఐ శివాంజల్**



పగలగొట్టిన బీరువాను చూపిస్తున్న బాధితురాలు

**మంత్రాలయం రూరల్, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని కల్లుదేవకుంట గ్రామంలో పట్టపగలే దొంగతనం జరిగిన సంఘటన చోటు చేసుకొంది. తన భార్య లక్ష్మి పొలం పనులు నిమిత్తం వెళ్లారు. పిల్లలుర పాఠశాలకు వెళ్లారు. ఎవరు లేని సమయం చూసి పట్టపగలే దొంగలు ఇంట్లో దూరి బీరువాను పగలగొట్టి రూ.70వేలు నగదు, 5తులాల బంగారం, 10తులాల వెండిని ఆపహరించినట్లు తెలిపారు. పాఠశాల నుంచి వచ్చిన పిల్లలు చూశారు. ఈ విషయాన్ని ఫోన్ ద్వారా తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఈవిషయాన్ని చూసి ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లో దూరి బీరువాలను పగలగొట్టి తీసుకొని వస్త్రాలను పడేసి వెళ్లినట్లు గుర్తించారు. ఇంటికొచ్చిన రామాంజనేయులు తన భార్య లక్ష్మితో కలిసి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఎస్.ఐ శివాంజల్ తెలిపారు. కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ తెలిపారు.

# కుక్కలు బాబోయ్ కుక్కలు

**– భయాందోళనలో ప్రజలు – గుంపులు గుంపులుగా గృహ సముదాయాలలో సంచారం**

**కొలిమిగుండ్లమేజర్,న్యూస్:** మండల కేంద్రమైన కొలిమిగుండ్లలోని గృహ నివాసాలు, పాఠశాలలు, రోడ్లపై కుక్కలు గుంపులు గుంపులుగా జనవాసాలలో విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. దీంతో ప్రజలు, విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రజలు, వృద్ధులు, పిల్లలు బయటికి వచ్చినప్పుడు దాడికి పాల్పడుతున్నాయని భయాందోళన లో ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. ఆడపాదడపా అనేక ప్రాంతాలలో కుక్కలు చిన్నారులపై చేస్తున్న దాడులలో ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు అనేకం మనం చూస్తూ వింటూనే ఉంటాం కానీ ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం వాటిని నివారించేందుకు చర్యలు తీసుకోవడం లేదు. ఎప్పుడు ఎక్కడ కుక్కలు ఎవరిపై దాడి చేస్తాయో ఎంతటి ప్రాణ నష్టం వాటిల్లుతుందోనని భయాందోళనలో ప్రజలు జీవిస్తున్నారు.



# అన్నదాతలకు అండగా టిడిపి ప్రభుత్వం

**డిసిఎంఎస్ ఛైర్మెన్ జాతీయ బీసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.నాగేశ్వరరావుయాదవ్**



గ్రామంలో పర్యటిస్తున్న వై.నాగేశ్వరరావుయాదవ్, అధికారులు

**ప్యాపిలి, మేజర్‌న్యూస్:** రాష్ట్రంలోని రైతన్నలకు అండగా తెలుగుదేశం ప్రభుత్వం నిలుస్తుందని డిసిఎంఎస్ ఛైర్మన్, జాతీయ బీసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.నాగేశ్వరరావుయాదవ్ అన్నారు. రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి ఆశీస్సులతో గురువారం మండల పరిధిలోని చంద్రపల్లె గ్రామంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 29వ తేది వరకు వ్యవసాయ అధికారులు ప్రతి రైతు ఇంటికి స్వయంగా వెళ్ళి రైతుల సమాచారాన్ని సేకరించడంతో పాటు, వారికి పలు ముఖ్యమైన సూచనలు రైతులకు అవగాహన, పంటల మార్పిడి వ్యవసాయ అధికారులు రైతులను సాంప్రదాయంగా వస్తున పంటల సాగును కాకుండా, నూతన, లాభదాయకమైన పంటల వైపు అడుగులు వేసేలా ప్రోత్సహించి సిద్ధం చేయనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా చంద్రపల్లె గ్రామంలో రైతుసేవా కేంద్రంలో విధులు నిర్వహించే అగ్రికల్చర్ అసిస్టెంట్‌తో పాటు ఆరుగురు సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్ళి రైతుల సమాచారాన్ని సేకరించారు. ఇందులో ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయ అధికారులను కూడా భాగస్వామ్యం చేసిందన్నారు. అధికారులు ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను మళ్లించేలా తగిన సూచనలు ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు ప్రజలకు వివరించిన టిడిపి నేతలు



వార్డులోని మహిళల సమస్యలు తెలుసుకుంటున్న తెదేపా నాయకులు

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** నగరంలోని 23వ వార్డు శ్రీరామ్ నగర్‌లో తెలుగుదేశం పార్టీ 23, 24వ వార్డు క్లస్టర్ ఇంచార్జ్ ప్రవీణ్ ఆద్వర్యంలో బూత్ ఇంచార్జ్‌లు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు ప్రజలకు వివరించారు. తెదేపా నాయకులు 95వ బూత్‌లో ప్రజలను కలిసి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పింఛన్ పెంచి ఇవ్వడం, ఉచిత సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు. అలాగే ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. పింఛన్లు సక్రమంగా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ, విద్యుత్ సరఫరా, తాగునీటి సరఫరా విషయంలో ఇబ్బందులు ఉంటే స్థానికంగా తమ దృష్టికి తెస్తే మంత్రి టీజీ భరత్ దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. కర్నూలుకు పరిశ్రమలు తెచ్చేందుకు సిఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలో మంత్రి టీజీ భరత్ అహర్నిషలు కృషి చేస్తున్నట్లు క్లస్టర్ ఇంచార్జ్ ప్రవీణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బూత్ ఇంచార్జ్‌లు, కె నాగరాజు, మేరీ, తిమ్మప్ప, వీరేష్ గౌడ్, ప్రతాప్, మద్దిలేటి పాల్గొన్నారు.

# అభివృద్ధి వైపు పరుగులు తీస్తున్న ముచ్చిగేరి గ్రామం





ముచ్చిగేరిలో అభివృద్ధి పనులు కొనసాగుతున్న దృశ్యం

**పెద్దకడుబూరు మేజర్ న్యూస్:** పెద్దకడుబూరు మండల పరిధిలోని ముచ్చిగేరి గ్రామం అభివృద్ధి వైపు పరుగులు తీస్తోంది. ముఖ్యంగా గ్రామ సర్పంచ్ హనుమంతు గ్రామపంచాయతీ నిధులతో మొత్తం రూ26లక్షాలాది రూపాయలు వెచ్చించి గ్రామంలో మురుగు కాలువలు నిర్మాణం పనులు చేపట్టారు. అధేవిధంగా గ్రామంలో రెండు అంగన్వాడి కేంద్రాలు భవణం నిర్మాణం పనులు చేపట్టడం జరిగిందన్నారు. గ్రామానికి సమీపంలో ఉన్న వంక పై కల్వర్టు నిర్మాణం పనులు చేపట్టడం జరిగిఒది. అలాగునే గ్రామంలో పలు చోట్ల కల్వర్టు నిర్మాణం పనులు పూర్తి చేశామని ఆయన తెలిపారు. గ్రామంలో మండల విధ్యుత్ శాఖాధికారి నారాయణ స్వామి సహకారంతో మూడు విధ్యు త్ ట్రాన్స్ ఫార్మ ర్ ఏర్పాటు చేసినట్లు ఆయ న చెప్పారు. గుంతల పడిన రోడ్లపై మట్టి వేయడం జరు గిందని అయన తెలిపారు.



ముచ్చిగేరి గ్రామసర్పంచ్ బి. హనుమంతు

# సంక్షేమ వసతి గృహాలలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

**–జిల్లా కలెక్టర్ రాజకుమారి**

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో వార్డెన్‌లు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం అమరావతి నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ రైతుల నుంచి ధాన్యం సేకరణ, గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా సిటిజన్ సర్వే, సంక్షేమ హాస్టళ్ళల్లో పారిశుధ్యం తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసమావేశానికి నంద్యాల కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్



సీఎస్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజకుమారి, జే సీలు

రాజకుమారి గణియా, జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో ఉన్న బాలికల, బాలుర వసతి గృహాలు, బీసీ హాస్టళ్లు రెసిడెన్షియల్ పాఠశాలలో పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉండడంతో విద్యార్థిని విద్యార్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని హాస్టల్ వార్డెన్లు వసతి గృహాల పరిశుభ్రతపై దృష్టి చేపట్టాలన్నారు. బాలికల వసతి గృహాలలో పిల్లలు ఉతికిన బట్టలు ఆరేసుకునేందుకు రూ.500లు ఖర్చు చేసి ఒక తీగ కట్టలేని పరిస్థితుల్లో వార్డెన్లు ఉన్నారన్నారు. హాస్టళ్ళను ఆకస్మిక తనిఖీ చేసినప్పుడు అపరిశుభ్రంగా ఉన్నట్లయితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈవిషయాన్ని వసతి గృహ అధికారులు దృష్టిలో పెట్టుకుని విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించాలన్నారు.

## మట్కాబీటర్ అరెస్ట్

**15 లీటర్ల నాటుసారా స్వాధీనం**

**ప్యాపిలి, మేజర్‌న్యూస్:** పట్టణానికి చెందిన మట్కాబీటర్ బషీర్‌ను గురువారం అరెస్ట్ చేసి, అతని వద్దనున్న వెయ్యి రూపాయలతో పాటు 15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ప్యాపిలి ఎస్సై మధుసూదన్ పేర్కొన్నారు.

## బొలేరో వాహనం కాల్చిన వ్యక్తి అరెస్ట్

**కొలిమిగుండ్లమేజర్,న్యూస్:**

కొలిమిగుండ్ల మండలంలోని ఎర్రగుడి గ్రామంలో 11.11.2025వ తేదీ అర్ధరాత్రి సమయంలో పోలు సురేష్‌కు చెందిన బొలెరో వాహనంను పెట్రోల్ పోసి కాల్చిన కేసులో అదే గ్రామానికి చెందిన ముద్దాయి అయిన నిమ్మకాయల శశితేజ అను వ్యక్తిని కొలిమిగుండ్ల బస్టాండు వద్ద అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సి.ఐ రమేష్‌బాబు తెలిపారు. ఇదే కేసులోరెండవముద్దాయిపరారీలో ఉన్నట్లు తెలిపారు.